
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 23 అక్టోబరు 2024 | 5



అక్షరం.. ఆయుధమై!

అక్షరమే ఆయుధమైంది.. ప్రజల సమస్యలపై గళమెత్తింది.. అధికారులను పరుగులు పెట్టించింది.. సమస్యల పరిష్కారంలో ఆంధ్రజ్యోతి సత్తాచాటింది.. గోకవరం రెవెన్యూ కార్యాలయంలో అర్ధరాత్రి అవినీతి గబ్బిలాల జాడ చూపింది.. స్పం దించిన ఉన్నతాధికారులు విచారణలో దిగారు.. ఇక రైల్వే స్టేషన్‌లో చెత్త కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేయడంతో ఏకంగా కాంట్రాక్టు సంస్థ మారిపోయింది.. మరో వైపు నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ అంటూ ప్రశ్నించడంతో జేసీ చిన్నరాముడు రంగంలోకి మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోకవరంలో దందాపై ఆర్డీవో విచారణ

గోకవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలంలోని రెవెన్యూ శాఖలో అవినీతి గబ్బిలాలను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల విచారణకు దిగారు. అవినీతి గబ్బిలాలు శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి రంగంలోకి దిగారు.స్థానిక తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి నివేదిక అందజేయాలని ఆదేశించారు.మంగళవారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని విచారణ నిర్వహించారు. సుమారు 12 మంది వీఆర్వో లను, కార్యాలయ సిబ్బందిని ఒక్కొక్కరిని తహశీల్దార్ గదిలోకి పిలిచి ఒంటరిగా విచారణ చేసినట్టు తెలిసింది. ఏ గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు..ఎన్నేళ్లగా ఈ మండ లంలో కొనసాగుతున్నారు.. ఎవరిపై ఏమేమి ఆరోపణలు ఉన్నాయి తదితర వివరాలపై వీఆర్వోల నుంచి ఆర్డీవో ఆరా తీశారు.

రైల్వేస్టేషన్ పారిశుధ్య కాంట్రాక్టు రద్దు

రాజమహేంద్రవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ పారిశుధ్య కాంట్రాక్టును రద్దు చేస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ అపారిశుధ్యంతో కంపుకొడుతుండడం, నెలల తరబడి వ్యర్థాలు టన్నుల్లో పేరుకుపోవడంపై 'స్వచ్ఛత నహీ' శీర్షికన ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. డివిజనల్ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. అప్పటికే ఆగస్టు 8,అక్టోబరు 7న ఇచ్చిన నోటీస్‌లపై తగు చర్యలు తీసుకోకపో వడాన్ని తప్పుబట్టారు.గతేడాది 29న హైదరాబాద్‌కి చెందిన ఎస్ఆర్ ఎంటర్ ప్రైజస్‌తో చేసుకున్న పారిశుధ్య కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేస్తూ సోమవారం(21న) సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎం.కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరా బాద్‌కి చెందిన ఫైవ్‌స్టార్ ఎంటర్ ప్రైజస్ సంస్థకు తాత్కాలికంగా పారిశుధ్య బాధ్యతలు అప్పగించినట్టు చెబుతున్నారు.

ప్రతి ధాన్యం గింజ కొంటాం : జేసీ

నల్లజర్ల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని జేసీ చినరాముడు అన్నారు.ఈ నెల 19వ తేదీన నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలేవి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు.మంగళవారం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత,తహశీల్దార్ శాంతి ప్రియ,ఎంపీడీవో సింహాద్రిరావు పాల్గొన్నారు.

దారెటు : కడియం మండలం బుర్రిలంక ర్యాంపు వద్ద ట్రాక్టర్లు



ఇసుక.. క్యూ

ఉచితమంటే.. దర్జాగా దోపిడీ

బుర్రిలంకలో రవాణా ఇలా..

దర్జాగా లోడింగ్ : పెరవలి మండలం తీపర్రులో ఇలా..

- జిల్లాలో ఇసుక అక్రమ రవాణా
- సీఎం హామీతో గందరగోళం
- ర్యాంపులకు భారీగా ట్రాక్టర్లు
- ఇల్లు కట్టుకోనివారు క్యూ
- యథేచ్ఛగా ఇసుక తరలింపు
- ఖాళీ ప్రదేశాల్లో డంప్
- రాత్రికి ఇసుక అమ్మకాలు
- కరువైన పర్యవేక్షణ
- అడ్డుకోని అధికారులు

రాజమహేంద్రవరం/పెరవలి/సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉచితమంటే ఊరుకుంటారా.. అవసరం ఉన్నా లేకపోయినా క్యూ కట్టేయరూ..! ఫ్రీగా వస్తే పెనాయిల్ కూడా వదలరనేది గోదావరి నానుడి..ఆ నానుడిని గత మూడు రోజులుగా నిజం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నోట ఇసుక ఉచితం మాట అన్నప్పటి నుంచి అదే చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. నిబంధనలు మీరి తరలించేస్తున్నారు. దీంతో ఉచిత ఇసుక విధానం గందరగోళంగా మారింది.అవసరం మేరకు ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్లతోనూ ఇసుక తవ్వుకుని తీసుకుని వెళ్లొచ్చని సీఎం నారా చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన ప్రజల్లోకి తప్పుగా చేరినట్టు ఉంది.తూర్పుగోదావరి జిల్లాలో పలు ర్యాంపులు, లంకల్లోకి వందల కొద్దీ ట్రాక్టర్లతో ప్రజలు వచ్చి ఇసుక తవ్వుకుపోతున్నారు. రెండు రోజుల నుంచి ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తున్నారు. వాస్తవానికి వాగులు, నదులకు సంబంధించిన పిల్ల పాయల్లో ఇసుకను సొంతింటి అవసరాలకు ఉచితంగా ట్రాక్టర్లతో తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ గోదావరిలో కూడా ఉచితంగా ట్రాక్టర్లతో తవ్వుకోమని చెప్పినట్టు భావించిన ప్రజలు, ఇతరులు వందలకొద్దీ ట్రాక్టర్లను ఇసుక ర్యాంపుల్లోకి దింపి ఇష్టానుసారం ఇసుక తవ్వుకుపోతున్నారు. రెవెన్యూ, మైన్స్ అధికారులు ప్రశ్నిస్తే సీఎం గారే తవ్వుకోమంటే మీకేంటి అభ్యంతరం అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకూ ఏం చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. వేమగిరి- కడియపులంక ర్యాంపుల్లో మూడు రోజులుగా వందల ట్రాక్టర్ల ద్వారా ఎవరికి నచ్చినట్టు వారు ఇసుక తవ్వుకుపోతున్నారు. గత రెండు మూడు రోజులుగా పెరవలి మండలం తీపర్రు ర్యాంప్ నుంచి ఎగుమతులు జరుగుతుండగా పెండ్యాల ర్యాంప్‌లో సోమవారం నుంచి తవ్వకాలు ప్రారంభం అయ్యాయి. రెవెన్యూ అధికారులు ర్యాంప్‌ల వద్దకు వెళ్లి ఆరా తీయగా సీఎం ప్రకటనతో ఇసుక ఎగుమతి చేస్తున్నామని చెప్పడం గమనార్హం. సీతానగరం మండలం వంగలపూడి ర్యాంపులోనూ ట్రాక్టర్లు క్యూకడుతున్నాయి. ర్యాంపుల లోపలకు వెళ్లడానికి బాటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కేవలం ఇళ్ళు కట్టుకునే వారికి మాత్రమే అవసరానికి ఇసుక తీసుకువెళ్లడానికి అనుమతి ఉన్నప్పటికి ఉదయం నుంచి రాత్రి వరకు ఖాళీ లేకుండా ట్రాక్టర్లు పరుగులు తీస్తున్నాయి. గ్రామాల్లో ట్రాక్టర్ల అతివేగంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై వివరణ కోరగా పెరవలి, సీతానగరం తహశీల్దార్లు అచ్యుత కుమారి,ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ గృహనిర్మాణ అవసరాలకు మాత్రమే ఇసుక తీసుకువెళ్ళవచ్చు. ఇసుక నిల్వలకు అనుమతి లేదు. ముందుగా ట్రాక్టరు నమోదు చేయించుకోవాలి. లైసెన్సులు లేని ట్రాక్టర్లు, పిల్లలు డ్రైవింగ్ చేసిన ట్రాక్టర్లను సీజ్ చేస్తాం.ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపును ఉన్నతాధికారులకు తెలియజేశాం.. ఆదేశాలు మేరకు నడుచుకుంటామని తెలిపారు.

ఇంటి నిర్మాణానికే తరలించాలి..

ఉచిత ఇసుక విధానం అమలులో అవకతవకలకు పాల్పడినట్టు గుర్తించినా, అనుమతివ్వని ర్యాంపుల్లో తవ్వకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 16 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు జారీ చేశాం. ఉచిత ఇసుక విధానంలో జిల్లా యంత్రాంగం గుర్తింపు ఇచ్చిన ప్రాంతాల్లో మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పరిమితులకు లోబడి తీసుకువెళ్లాలి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం,మరమ్మతులకు మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకువెళ్లాలి. డంపు చేయడం, నిల్వ చేయడం కుదరదు.

- జేసీ ఎస్.చిన్నరాముడు

పెండ్యాలలో ఇసుక మాఫియా..

నిడదవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం కొందరు దళారులు వరంగా మార్చుకుంటున్నారు. సామాన్యుల ఇళ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్న ప్రభుత్వ విధానానికి తూట్లు పొడుస్తూ ఇసుక మాఫియా అక్రమాలకు తెరలేపింది. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి కొందరు ఇసుకాసురులు ఇసుక అక్రమ విక్రయాలకు తెరలేపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లి పెండ్యాల, పరిసర గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో అనధికార స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని ఇసుకను డంప్ చేస్తున్నారు. రాత్రి కాగానే లారీల ద్వారా ఇసుక విక్రయాలు సాగిస్తున్నారు. ఫోన్‌కు డబ్బులు పంపితే లారీల ద్వారా ఇసుక ఇంటి ముంగిటకు చేరుస్తున్నారు. 20 టన్నుల ఇసుక లారీ ప్రభుత్వ ధరల ప్రకారం రూ.5400లు కాగా ఇసుకాసురులు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అవసరాన్ని బట్టి ధర నిర్ణయించి విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్క పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచే రోజుకు సుమారు 300 ట్రాక్టర్లకు పైగానే ఉచితంగా ఇసుక తరలిస్తుండగా 100 ట్రాక్టర్లు రోజుకు మూడు ట్రిప్పుల చొప్పున ఉదయం నుండి రాత్రి వరకు పెండ్యాల చుట్టు పక్కలే అనధికార ఇసుక డంప్‌లకు తరలిపోతుంది. పెండ్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం రోడ్డంతా అక్రమ ఇసుక నిల్వలకు అడ్డాగా మారిపోయింది. గ్రామంలోనే చిన్నా పెద్దా కలిపి సుమారు 40 నుండి 50 వరకు ఇసుక గుట్టలు ఉన్నాయి. పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి కొందరు అధికారులు, సిబ్బందికి భారీగా మామూళ్ళు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



అక్రమాలకు రీచ్ : నిడదవోలు మండలం పెండ్యాల ర్యాంపులో ఇలా

అనపర్తి మండలం కొప్పవరంలో డిస్టలరీ ఫ్యాక్టరీ



డిస్టలరీలపై.. సీఐడీ

- ఉదయం నుంచి తనిఖీలు
- 4 డిస్టలరీల్లో సోదాలు
- కీలక దస్త్రాలు స్వాధీనం
- నాటి అక్రమాలపై ఆరా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో జరిగిన మద్యం అక్రమాలను వెలికి తీసే పనిలో సీఐడీ దూకుడు పెంచింది. జిల్లాలోని డిస్టలరీలలో మంగళవారం ఏకకాలంలో తనిఖీలు చేశారు. వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం విక్రయించే విధానాన్ని అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. మంచి బ్రాండ్లను ఆపేసి సొంతంగా మద్యం తయారుచేసి సొంత పేర్లతో నాసి రకం మద్యం విక్ర యించారు. డిజిటల్ లావాదేవీల ఊసే లేకుండా నగదు రూపంలో అమ్మకాలు చేసి లెక్కపత్రం లేకుండా వైసీపీ పెద్దలు దోచుకున్నారు.జిల్లాలో నెలకు రూ.150 కోట్లకు పైగా వ్యాపారం జరిగేది. కూటమి అధికారంలోకి రావడంతో మద్యం పాలసీని మార్చింది. దీంతో అప్పటి అక్రమాలపై దర్యాప్తును సీఐడీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే గతంలో వ్యవహారం నడిపిన ఉన్నతస్థాయి అధికారుల మెడకు ఉచ్చు బిగిసింది.అసలు ఈ అక్రమాల వెనుక ఎవరున్నారు.. ఎంత మేర అక్రమాలు జరిగాయనేది తేల్చడానికి సీఐడీ అధికారులు ఏకకాలంలో సోమవారం అన్ని చోట్ల సోదాలు మొదలు పెట్టారు.రాజమహేంద్రవరంలోని సీఐడీ రీజనల్ ఆఫీసు నుంచి ఏఎస్పీ హస్మా ఫర్వీన్ ఆధ్వర్యంలో సీఐడీ డీఎస్పీలు, సీఐలు, ఇతర సిబ్బంది, ఎక్సయిజ్ అధికారులు తదితరులు తనిఖీలు చేస్తున్నారు. కానీ ఏవిధమైన సమాచారం బయటకు చెప్పడం లేదు. లోపలకు వెళ్లి గేట్లకు తాళాలు వేసి తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో రంగంపేట మండలంలోని నల్లమిల్లిలో ఫ్రాగ్ మద్యం పరిశ్రమ, కోటపాడులోని మద్యం బాట్లింగ్ యూనిట్, అనపర్తి మండలం కొప్పవరం బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ తనిఖీలు జరుగుతున్నాయి. తాళ్లపూడి మండలం తుపాకుల గూడెంలో కూడా డిస్టిలరీ ఉంది. వైసీపీ హయాంలో భూంభూం బ్రాండ్ ఇక్కడ నుంచి వచ్చేదని సమాచారం. ఇక్కడ గతంలో ఏపీ బ్రాండ్లు తయారు చేసేవారు.. వైసీపీ హయాంలో ఏ బ్రాండ్లు తయారు చేశారు. ఎక్కడ నుంచి సరుకు వచ్చేది తదితర వివరాలు సేకరిస్తున్నారు. అప్పటి రికార్డులన్నీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. డిస్టిలరీల నిర్వాహకులను ఎక్కడికి కదలకుండా చేయడంతో పాటు అక్కడ పనిచేసేవారిని కూడా అదుపు చేసి వివరాలు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సోదాలు జరుగుతూనే ఉన్నాయి. సీఐడీ అధికారులు మాత్రం తాము చేస్తున్న సోదాల గురించి లీకులు ఇవ్వడంలేదు.

కొప్పవరంలో కీలక దస్త్రాలు..

అనపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కొప్పవరంలోని బీడీహెచ్ ఆగ్రోవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై మంగళవారం సీబీఐ డీఎస్పీ భూపాల్ ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు దాడులు చేశారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం వరకు సాగాయి. తనిఖీల వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు. దాడుల్లో పలు కీలకమైన సమాచారం ఉన్న దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నియోజకవర్గంలోని మూడు డిస్టలరీలలోను గత నాలుగేళ్ళగా మద్యం తయారీలేకుండా కేవలం బాట్లింగ్ యూనిట్లగానే వీటిని నిర్వహించినట్టు సమాచారం.ట్యాంకర్ల ద్వారా వచ్చిన మద్యాన్ని ఇక్కడ ప్యాకింగ్ చేసి లేబుల్స్ అతికించి పంపించడమే జరిగినట్టు సమాచారం.

రంగంపేటలోనూ తనిఖీలు..

రంగంపేట,అక్టోబరు 22 : రంగంపేట మండలం కోటపాడు, నల్లమిల్లి బీరు ఫ్యాక్టరీలలో ఏకకాలంలో మంగళవారం ఉదయం 9 నుంచి అర్ధరాత్రి వరకూ విశాఖపట్నం నుంచి వచ్చిన సీఐడీ అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి సోదాలు చేశారు.సీఐడీ డీఎస్పీ కుమారస్వామి ఆధ్వర్యంలో కోటపాడు బీరు ఫ్యాక్టరీ, సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లమిల్లి బీరు ఫ్యాక్టరీలోనూ గేట్లు తాళాలు వేసి ఎవరినీ లోపలికి అనుమతించకుండా సోదాలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వం అధికాంలో ఉన్న 2019 నుండి 2024 వరకు జరిగిన మద్యం తయారీ, అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్టు సమాచారం. కోటపాడులో ఉన్న ఫ్యాక్టరీ నెలకు ఒకకోటి ఏభై లక్షల మద్యం సీసాలను తయారు చేసే సామర్థ్యం కలిగిన ఫ్యాక్టరీ. సోదాల్లో మద్యం తయారీకి, అమ్మకాలకు భారీగా వ్యత్యాసం ఉన్నట్టు సీఐడీ అధికారులు గుర్తించినట్టు సమాచారం.ఫ్యాక్టరీలో ఉన్న రికార్డులను సీజ్ చేస్తున్నారని తెలిసింది. సోదాలు రెండో రోజు బుధవారం కొనసాగే అవకాశాలున్నాయి.

932 పాఠశాలలకు రూ.15 కోట్లు

బడులకు నిర్వహణ నిధులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఉపశమనం కలగనుంది. జిల్లాలోని 932 ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 2024-25 ఆర్థిక సంవత్స రానికి నిర్వహణ ఖర్చులకు నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ని మంగళవా రం జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాకు మొత్తం రూ.29.64 కోట్లు కేటాయించగా ప్రస్తుతం రూ.14.82 కోట్లు రానున్నాయి. యూడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. కరెంటు బిల్లులు చెల్లించడంతో పాటు చాక్‌పీస్‌లు, డస్టర్లు, పేప ర్లు, పెన్నులు వంటి ఆఫీస్ స్టేషనరీ వం టివి సమకూర్చుకోవాల్సి ఉంటుంది.ఈ మేరకు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడ్డ రైల్వే పారిశుధ్య కార్మికులు

- పాత కార్మికుల తొలగింపు
- 4 నెలల జీతమూ దిక్కులేదు
- కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగింత
- పనులకు బయట కార్మికులు
- విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



రాజమహేంద్రవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులోని పారిశుధ్య కార్మికులు రోడ్డున పడ్డారు. ఏళ్ల తరబడి పొందుతున్న ఉపాధి అయోమయంలో పడింది. తమ దుస్థితిపై అధికారులకు విన్నవిస్తే అరెస్టు చేయిస్తామంటూ ప్రతాపం చూపించడంతో ఆంధ్రజ్యోతిని ఆశ్రయించారు. రైల్వే స్టేషనులో 20 మంది మహిళా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ట్రాక్, బాత్ రూమ్‌లు, ప్లాట్‌ఫాంలు, ప్రాంగణం, కార్యాలయాల క్లీనింగ్‌తో పాటు వ్యర్థాలను లారీలోకి ఎగుమతి చేసే బాధ్యత వీరిదే. వీరికి పారిశుధ్య కాంట్రాక్టరు రోజుకు రూ.504 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ పని చేయించుకున్న ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థకు రైల్వే కాంట్రాక్టు రద్దు చేసింది. అయితే ఆ సంస్థ ఇప్పటికే పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల జీతం బకాయి పడింది. హైదరాబాద్‌కి చెందిన మరో సంస్థకు తాత్కాలికంగా పారిశుధ్య బాధ్యతలను అప్పగించారు.ఆ సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌ని పారిశుధ్య పనివాళ్లు కలిసి తమకు 4 నెలల జీతం పాత కాంట్రాక్టరు ఇవ్వాలని చెప్పారు. ఆయన తమకు ఆ జీతం సంబంధం లేదని, తాము వేరే పనివాళ్లతో శుభ్రం చేయిస్తామని చెప్పారు. తాము ఉపాధి కోల్పోతుండడంపై స్థానిక అధికారికి కన్నీళ్లతో విన్నవించుకున్నారు. పని చెబుతాను కానీ పాత బకాయి ఇప్పించడం తాను చేయలేనని ఆ అధికారి బదులిచ్చారు. ఎక్కువగా వాదిస్తే అరెస్టు చేయిస్తా నంటూ బెదిరించారు. దీంతో ఆ మహిళా కార్మికులు ఉసూరుమంటూ రైల్వే కార్మి కుల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వద్దకు వెళ్లి తమ సమస్యను విన్నవించుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

2009 నుంచీ ఇక్కడే పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నాం. అప్పట్లో జీత భత్యాలు ఠంచనుగా ఇచ్చేవారు. తర్వాత పరిస్థితి మారింది. జీతం అడిగితే పనిలోకి వస్తే రండి లేకపోతే పొండి అని మాట్లాడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు అర్థం చేసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నాం.

- భాస్కరరావు, కన్నతల్లి దంపతులు



నామవరంలో అర్జీదారుల సమస్యవింటున్న కలెక్టర్ ప్రశాంతి

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : కలెక్టర్

దివాన్‌చెరువు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభలు నిర్వహించే క్రమంలో సంబంధిత గ్రామాలకు చెందిన రికార్డులతో హాజరుకావాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. రాజానగరం మండలం నామవరంలో మంగళవారం జరిగిన రీసర్వే గ్రామసభలో కలెక్టర్ మాట్లాడారు. రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సర్వేపూర్తయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో అభ్యంతరాలు పై భూమి వాస్తవ కొలతలకు, డాక్యుమెంట్ ప్రకారం ఉన్న కొలతలు, రీసర్వే సందర్భంగా ఉన్న కొలతలు ఆధారంగా పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత అర్జీదారులు సామూహిక పత్రంతో రీసర్వే గ్రామసభలకు హాజరుకావాలని తెలిపారు. ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ ఎన్.లక్ష్మీలావణ్య, ఎంపీడీవో జె.ఏ.ఝాన్సీ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ తొలగించాలని నిరవధిక దీక్ష 7

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : డీఈవో

దివాన్‌చెరువు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితం ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండో తరగతిలో ఏర్పడిన పునాదులపైనే ఆధారపడి ఉంటుందని డీఈవో కె.వాసుదేవరావు అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులో జరుగుతున్న భాషా, పునాది అభ్యసన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించి మాట్లాడారు. ఒకటి, రెండు తరగతుల్లో విద్యార్థులకు చదవడం,రాయడంతో పాటు గణితంలో కనీస నైపుణ్యాలు సాధించే విధంగానూ, ప్రాథమిక పాఠశాలలో నమోదు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ఏ.ప్రభాకర్, ఏఎంవో డి.గౌరీశంకరరావు, ఎంఈవోలు నాగేశ్వరరావు, మధుసూదనరావు, కేఆర్పీలు మంగారాణి, ఇందూదేవి తదితరులు పాల్గొన్నారు.



టీఎల్ఎంలను ఆసక్తిగా తిలకిస్తున్న డీఈవో వాసుదేవరావు





ఐదు వేల ఏళ్లు జీవించే

మహావృక్షం

- ఏనుగుపాదాల చెట్టుగా నానుడి
- ఆఫ్రికా నుంచి తెచ్చిన వర్తకులు
- పరిరక్షిస్తున్న నగర కార్పొరేషన్




అడన్సోనియా డిజిటేటా మహావృక్షం

ఏ చెట్టు అయినా జీవితకాలం వందల ఏళ్లు ఉంటుందని తెలిసిందే. కానీ ఐదు వేల సంవత్సరాలు జీవించే వృక్షం ఒకటి ఉందని చాలామందికి తెలియకపోవచ్చు. ఈ మహావృక్షం గత 300 ఏళ్లకు పైబడి రాజమహేంద్రవరంలోనే పరిరక్షింపబడడం విశేషం. ఈ మహావృక్షం ఎన్నో తరాలను చూస్తూ బతికేస్తోంది. అనేక ప్రకృతి వైపరీత్యాలనూ తట్టుకుని నిలబడింది. రాజులకాలం రాచరికాన్ని, బ్రిటీష్ పాలకుల నియంతృత్వాన్ని, స్వదేశీ పాలకుల ఆదరణను ఈ మహావృక్షం చవిచూస్తూనే ఉంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో పాత ప్రవేశ ద్వారం పక్కనే ఈ వృక్షం దర్శనమిస్తుంది. ఇది బూరుగు జాతికి చెందిన అడన్సోయాడిజిటేటా అనే పేరుగల మహావృక్షం. దీన్ని మన దేశంలో బ్రహ్మఆమిక గోరక్ ఇమ్లి, మంకీబ్రెడ్‌ట్రీ అని కూడా పిలుస్తారు. ఆఫ్రికా దేశానికి చెందిన ఈ మహావృక్షాన్ని నవాబుల కాలంలో వర్తకులు రాజమహేంద్రవరానికి తీసుకువచ్చి ప్రస్తుతం నగరపాలక సంస్థ ఉన్న కార్యాలయం ప్రాంతం (నాటి కోటగుమ్మం వెలుపల) నాటారు. 300 ఏళ్ల పైబడి వయస్సు ఈ వృక్షానికి ఉంటుంది. ఈ వృక్షం ఐదు వేల సంవత్సరాలు జీవిస్తుందని వృక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక్కడ ఉన్న ఈ వృక్షాన్ని 2008 వరకు రాజమహేంద్రవరంలో దీన్ని చూసిన వారంతా మామూలు బూరుగు జాతిచెట్టుగానే అనుకున్నారు. కానీ అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ రాజేంద్రప్రసాద్ ప్రకృతి ప్రేమికుడు కావడంతో ఈ చెట్టును పరిశీలించి దీన్ని జాతిని గుర్తించారు. వెంటనే ఒక శిలాఫలకాన్ని అక్కడ పెట్టించి దానిపై విశిష్టత, చరిత్రను లిఖించారు. చెట్టు చుట్టూ సిమెంట్ కాంపౌండ్‌ను కట్టించారు. అప్పటికిగాని ఈ చెట్టు ప్రాధాన్యత బహిర్గతం కాలేదు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని అడన్సోయాడిజిటేటా చెట్టును ప్రజలు ఏనుగు పాదాల చెట్టుగా పిలుస్తున్నారు. ఈ చెట్టు గురించి ప్రజలకు తెలియకపోవడంతో దాని కాండం, మొదలు ఆకారం ఏనుగును, వాటి కాళ్లను తలపించేలా ఉండడంతో దీన్ని ఏనుగుపాదాల చెట్టుగా పిలవడం ప్రారంభించారు. సాధారణంగా ఏ చెట్టు కాండం చుట్టు కొలత పెద్దగా అంటే 6 మీటర్లు ఉంటుంది. కానీ ఈ మహావృక్షం చుట్టు కొలత 15 నుంచి 20 మీటర్ల వరకు ఉంది. చెట్టు మొదలకు వెళితే దాని ఆకారం చూస్తేనే ఏనుగు నిలబడినట్టు కనిపిస్తుంది. రాజుల కాలంలో ఈ వృక్షాల కాండంలో తొరలు తొలిచి అందులో శత్రువుల కంటపడకుండా తలదాచుకునే సంఘటనలు కూడా జరిగాయని చెబుతుంటారు. ఈ వృక్షం మే నుంచి ఆగస్టు వరకు పూత పూస్తుంది. ఏప్రిల్ నాటికి కాయలు కాసి పక్వానికి వస్తాయి. చిన్న కొబ్బరికాయ పరిమాణంలో కాయలు ఉంటాయి. ఈ కాయలో తెల్లటి సుద్దలా పప్పు ఉంటుంది. ఇది పూర్తిగా పుల్లగా ఉంటుంది. ఈ పప్పుతో ఆఫ్రికా దేశాల్లో షర్బత్‌లు చేసుకుని తాగుతారట. ఇక్కడ మాత్రం వాటిని చెట్టుకే వదిలేస్తారు. కానీ ఈ చెట్టు బెరడుతో చేసిన కషాయం మలేరియాను కంట్రోల్ చేస్తుందని, షరబత్‌తో బంక విరోచనాలు తగ్గుతాయని కొందరు పెద్దలు చెబుతున్నారు. అయితే తర్వాత కాలంలో ఈ చెట్టు మరికొన్ని చోట్ల కూడా ఉందని కడియం నర్సరీల యజమాని ఒకరు చెప్పారు. ఏనుగుపాదాల చెట్టుగాను, కల్పవృక్షంగాను పిలుస్తారని తెలిపారు. అయితే రాజమహేంద్రవరంలోని చెట్టు మాత్రం పురాతనమైందని, అనేక తుఫాన్లను తట్టుకుని నిలబడి ఉండడం విశేషమని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

కార్పొరేషన్ పరిరక్షణ

అరుదైన జాతి వృక్షంగా ఉన్న అడన్సోయా డిజిటేటా మహావృక్షాన్ని రాజమహేంద్రవరంలో బ్రిటీష్ పాలకుల నుంచి నేటి పాలకుల వరకు కాపాడుకుంటూ వచ్చారు. నాటి బ్రిటీష్ గవర్నర్ నివాసంగా ఉన్న ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయం పాత కట్టడం ఎదురుగా ఈ వృక్షం ఉంటుంది. రాజమహేంద్రవరంలో నవాబులు పాలించిన కాలంలో ముస్లిం వర్తకులు నాటిన ఈ వృక్షాన్ని నాటి బ్రిటిష్ పాలకులు, తర్వాత మన పాలకులు ఈ వృక్షాన్ని సంరక్షిస్తూ వచ్చారు. ఇప్పుడు నగర పాలక సంస్థ అధికారులు ఈ వృక్షాన్ని పరిరక్షిస్తూ వస్తున్నారు. ఈ వృక్షం ఐదు వేల ఏళ్ల జీవనం సాగిస్తుందనడానికి నిత్యయవ్వనం అన్నట్టుగా ఈ చెట్టు కనిపించడమే నిదర్శనం.

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం సిటీ





పైండావారి సత్రంలో సీలింగు ఫ్యాను.. పక్కన తయారీ లేబుల్

80 ఏళ్లుగా తిరుగుతూనే ఉంది..

పైండావారి సత్రంలో సీలింగు ఫ్యాను.. ఇప్పటిదాకా రిపేరు అనేదే లేదు

రామచంద్రపురం మండలం ద్రాక్షారామలోని పైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రంలో అడుగుపెడితే హాలులో ఉన్న పెద్ద పెద్ద రెక్కలతో భారీ సైజులో పెద్ద ఆకారంలో సీలింగు ఫ్యాను ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న స్మార్ట్ ఫ్యాన్లకు కాస్త భిన్నంగా ఉంటుంది. ఫ్యాను ప్రత్యేకత ఏమిటంటే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 80 ఏళ్లకుపైబడి ఈ సీలింగు ఫ్యాను తిరుగుతూనే ఉంది. ఇప్పటివరకు రిపేరు లేదు. రెండుసార్లు రంగులు వేశారంతే.. ఫ్యాను స్విచ్ వేస్తే హాలులో ఉన్న వారిపై గాలి వెదజల్లుతూ ఉంటుంది. పైండా వెంకన్న రామకృష్ణయ్య సత్రాన్ని 1826లో బంగాళా పెంకుటిల్లులో స్థాపించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి వచ్చే యాత్రికులకు రోజుకు ఎకరం పొలం పంటతో అన్నదానం చేయాలనే సంకల్పంతో 360 ఎకరాలు భూమిని సత్రంపేరిట రాసి పైండా వంశీకులు సత్రం స్థాపన చేశారు. తదుపరి కాలంలో 1940లో సత్రం భవన నిర్మాణం చేశారు. హాలులో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌కు చెందిన సీలింగు ఫ్యాను వేశారు. బ్రాండ్ పేరు ఎవరెస్ట్. 'సీలింగు ఫ్యాను 1940లో తయారుచేశారు. అప్పటి నుంచి సీలింగ్ ఫ్యాను తిరుగుతూనే ఉంది. ఈ ఫ్యాను నాటి వస్తువుల నాణ్యత, మన్నికకు ఓ సాక్ష్యం. - ఆంధ్రజ్యోతి, ద్రాక్షారామ



వాడపల్లి వేంకటేశ్వరస్వామి వసంత మండపంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు



స్వామివారి మూలవిరాట్‌కు బంగారు పుష్పాలతో పూజలు చేసిన దృశ్యం



వసంత మండపంలో బ్రహ్మోత్సవ పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీనివాసా గోవిందా..

- వైభవంగా రెండో రోజు బ్రహ్మోత్సవాలు
- కోదండరామ అలంకరణలో శ్రీవారు
- ఆకట్టుకున్న స్వామివారి అష్టదళపాదపద్మారాధన
- సరస్వతీ అలంకరణతో శ్రీవారి హంసవాహన సేవ

ఆత్రేయపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రెండో రోజు ఘనంగా జరిపారు. స్వామివారిని స్వర్ణశోభితుడ్ని చేసి నెమలి పింఛాలతో అలంకరించారు. పరిమళ పుష్పాలతో అలంకరించిన వసంత మండపంలో శ్రీవారు కొలువుతీరారు. ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనము, సప్త కలశారాధన మహా స్నపనము, వసంతోత్సవం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధన కన్నుల పండుగ నిర్వహించారు. యాగశాలలో ప్రధాన హోమాలు, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య జరిపారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధర రావు, కనకదుర్గాదేవి దంపతులు బ్రహ్మోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ మూలమంత్ర హవనము, అష్టోత్తర కలశారాధన, వేదఘోష, మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. హనుమత్ వేషధారణ, కేరళ వాయిద్యాలు, హనుమత్ వేషధారణ, తెలంగాణ తీన్‌మార్ వంటి పలు ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. విద్యుత్‌దీపాలు, పుష్పాలంకరణ, వేదఘోష, భక్తుల గోవిందనామాలు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య వాడపల్లి మారుమోగింది. అనంతరం రాత్రి సరస్వతి అలంకరణతో శ్రీవారు హంసవాహనంపై ఆశీనులయ్యారు. బాణసంచా కాల్పులతో పాటు భక్తుల హరి నామస్మరణ మధ్య తిరువీధుల్లో స్వామివారు విహరించి అభయహస్తం అందించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, లక్ష్మీమంగతాయారు దంపతులు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాధం, మంగాదేవి దంపతులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం సుప్రభాతసేవ, అష్టోత్తర శత కలసాభిషేకం, వేంకటేశ్వర హోమం, కోదండరామ అలంకరణలో శ్రీవారి హనుమత్ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



సరస్వతీ అలంకరణతో హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

ఆటో డ్రైవర్‌కు ఎస్పీ సన్మానం

ఇద్దరు విద్యార్థినుల కాపాడినందుకు అభినందన

దేవరపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఇద్దరు ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో మంగళవారం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ సన్మానించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన దేగల కోటేశ్వరరావు(కోటి) ఈనెల 19న రాజమహేంద్రవరం వెళుతుండగా ఇద్దరు ఆడపిల్లలు గోదావరి వంతెనపై నుంచి దూకడానికి యత్నించారు. దీంతో వాళ్ళను అడ్డుకుని ఆటోలో దేవరపల్లి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థి నులు రాజమహేంద్ర వరంలో ఇంటర్ చదు వుతూ హాస్టల్‌లో ఉంటు న్నారు. వారిద్దరు హాస్టల్‌లో ఉండి చదవలేక రాజమహేంద్రవరం గోదావరి వంతెనపె నుంచి దూకే ప్రయత్నం చేశారు. దీంతో ఆటోడ్రైవర్ అడ్డుకుని వారిని పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో అతన్ని సన్మానించి బహుమతి అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థినుల ప్రాణాలను కాపాడిన ఆటోడ్రైవర్ వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు.



ఆటోడ్రైవర్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్



బాలాత్రిపుర సుందరి అమ్మవారి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బాలాత్రిపుర సుందరి అమ్మవారి హుండీ

ఆదాయం లెక్కింపు

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోనున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో హుండీలు లెక్కించగా రూ.9 లక్షల 786 ఆదాయం వచ్చింది. మంగళ వారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ దారు వడ్డి ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో మొత్తం 8 హుండీలను లెక్కించారు. నోట్ల రూపంలో రూ.7,94,920, నాణేల రూపంలో రూ.1,05,866 కలిపి మొత్తం రూ.9,00,786 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వ హణాధికారి వండువల్లి వీర్రాజు చౌదరి తెలి పారు. ఈ ఆదాయం 40 రోజులకు వచ్చిం దని చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ప్రధానార్చ కులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, రామారావుపేట అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం కార్య నిర్వహణాధి కారి బాదం శ్రీరామచంద్ర మూర్తితో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యారావుపేట బ్రాంచి సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యాత్రా.. స్పెషల్స్!

- ప్రముఖ పుణ్య క్షేత్రాల యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- కాకినాడ నుంచి 20 కొత్త బస్సులు సిద్ధం చేసిన అధికారులు
- పంచారామ క్షేత్రాల నుంచి అయోధ్య వరకు ఎక్కడికైనా వెళ్లొచ్చు
- శబరిమలైకి వివిధ ప్యాకేజీలతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. యాత్ర జరిగే రోజుల సంఖ్యనుబట్టి మార్గంలో ఆలయాల కవరేజీ ఉండనుంది. ఈ ఏడాదీ శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక అద్దె బస్సులను ఏర్పాటు చేసింది. మూడు రకాల ప్యాకేజీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. నాలుగు రోజుల ప్యాకేజీ, ఏడు రోజులు ప్యాకేజీ, 11 రోజుల ప్యాకేజీగా ఏర్పాటుచేశారు. మార్గంలో ఉన్న కొన్ని ఆలయాల కవరేజీలో కొద్దిగా వ్యత్యాసంతో నిర్వహిస్తారు. భక్తులు సందర్శించడానికి ఎంచుకున్న దేవాలయాల ఆధారంగా వారి అవసరాల మేరకు ఈ యాత్రలు రూపొందించారు.

శబరిమలై యాత్రల ప్యాకేజీ..

కాకినాడ నుంచి విజయవాడ కనకదుర్గ, శబరిమలైకి నాలుగురోజుల యాత్ర ప్యాకేజీతో సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.5 వేలు. 7 రోజుల ప్యాకేజీతో శ్రీశైలం, మహానంది, శ్రీపురం, అరుణాచలం, శబరిమలై, పళని, కాణిపాకం, తిరుపతి, విజయవాడకి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.5850. అలాగే 11 రోజుల ప్యాకేజీతో విజయవాడ, శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, హంపి, గోకర్ణ, మురుడేశ్వర్, మూగాంబికదేవి, ఉడిపి, ధర్మస్థలి, శ్రీరంగపట్నం, మైసూర్, బృందావనం, గురువాయర్, ఏరుమేలి, పంబ, శబరిమల, నరులేనిల్, తిరువనంతపురం, కన్యాకుమారి, రామేశ్వరం, మధురై పళని, అరుణాచలం, శ్రీపురం, కాణిపాకం, తిరుపతికి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటుచేశారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.8,700 ఉంటుంది. ఆయా ప్యాకేజీలను బట్టి ఆ ప్రదేశాలుంటాయి. అయ్యప్ప భక్తులకు సేవలందించడంలో అనుభవం ఉన్న నిష్ణాతులైన డ్రైవర్లు బస్సులను నడుపుతారు.

కాకినాడ-శ్రీశైలం సర్వీసు రోజూ..

కాకినాడ నుంచి శ్రీశైలం వెళ్లాలనుకునే భక్తులకు ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు బస్సు సౌకర్యం ఉంది. కార్తీకమాసం నెలరోజులు అదనంగా సాయంత్రం 4.30గంటలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. ఈ బస్సులకు టిక్కెట్ ధర రూ.894గా ఉంది.

కాశీ, అయోధ్య యాత్ర స్పెషల్..

10 రోజులు.. 14 క్షేత్రాలు

అయోధ్యలో కొలువైన రాముడిని దర్శించుకోవాలనుకునే వారి కోసం అయోధ్యతోపాటు పలు పుణ్యక్షేత్రాలు కవరయ్యేలా ఆర్టీసీ పలు సర్వీసులు తీసుకువచ్చింది. టికెట్ ధర కూడా కాస్త అందుబాటులో ఉండడంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. ఈ సర్వీసులు అయోధ్య మీదుగా కాశీ వరకు అందుబాటులో ఉన్నాయి. 10 రోజుల్లో 14 క్షేత్రాలకు ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా రూట్ మ్యాప్ ఉంటుంది. పూరి, కోణార్క్, సాక్షి గోపాలం, భువనేశ్వర్, జాజ్‌పూర్, గయ, బుద్ధగయ, శిరోగయ, కాశీ, త్రివేణి సంగమం, సీతామడి, ప్రయోగ, అయోధ్య, నైమిశారణ్యం వంటి పలు పుణ్యక్షేత్రాలు కవరయ్యేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లుచేశారు. తక్కువ ఖర్చులోనే తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే వారికి టూర్ ప్రయోజనం కలిగిస్తుంది. మరోవైపు ఈ సర్వీసుల్లో ప్రయాణం కోసం ఒక్కొక్క ప్రయాణికుడికి టికెట్ ధర రూ.12 వేలు ఆర్టీసీ నిర్ణయించింది.

అరుణాచల గిరిప్రదక్షిణ యాత్ర..

కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి పంచభూత లింగ క్షేత్రాల్లో ఒకటైన అరుణాచలం అగ్నిలింగ క్షేత్రం. పరమ పవిత్రమైన అరుణాచల గిరిప్రదక్షిణ సాక్షాత్తూ పరమ శివుని ప్రదక్షిణ అని భక్తుల విశ్వాసం. జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రాల్లో ఇది ఒకటి. భక్తుల కోరిక మేరకు ఆర్టీసీ కాకినాడ డిపో ద్వారా పౌర్ణమి ముందురోజు అరుణాచలగిరి ప్రదక్షిణ యాత్రకు బస్సులు నడుపుతున్నారు. టిక్కెట్ ఒక్కొక్కరికీ రూ.3100గా ఉంది. అరుణాచలగిరి ప్రదక్షిణ యాత్ర బస్సులను గ్రూపుగా కూడా బుక్ చేసుకోవచ్చు.

ఒకేరోజులో పంచారామాల యాత్ర

కార్తీక మాసంలో ప్రత్యేక దర్శనాల కోసం ఆర్టీసీ పంచారామల టూర్ ప్యాకేజీని రూపొందించింది. కార్తీకమాసాన్ని శివునికి అత్యంత ప్రీతికరమైన మాసంగా చెప్తారు. అందుకే ఈ నెలలో ప్రముఖ శైవ క్షేత్రాలైన పంచారామాలను చాలామంది. దర్శిస్తుంటారు. ఈ క్షేత్రాలన్నీ మన రాష్ట్రాలోనే ఉండడం విశేషం. ఒకే రోజులో ఈ ఐదు ఆలయాలను కవర్ చేసేలా ఆర్టీసీ ఓ స్పెషల్ ప్యాకేజీని అందుబాటులో ఉంచింది. కాకినాడ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుంది. ముందుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, చివరిగా సామర్లకోట దర్శనం జరుగుతుంది. అనంతరం ప్రయాణికులతో బస్సు మరుసటిరోజు రాత్రికి కాకినాడ డిపోకు చేరుతుంది. కార్తీకమాసంలో ప్రతి శని, ఆదివారాల్లో అనగా నవంబరు 2,3,9,10,16,17,23,24, 30, డిసెంబరు 1 తేదీల్లో బస్సు పంచారామ క్షేత్రాలకు బస్సు రాత్రి 8 గంటలకు బయలు దేరుతుంది. పంచారామ టూర్ టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ రూ.910, అల్ట్రా డీలక్స్‌కు రూ.1120, సూపర్ లగ్జరీకి రూ.1160గా ఉన్నాయి.

పర్యటన ఇలా..

కాకినాడ నుంచి నేరుగా పంచారామాల్లో ఒకటమైన అమరావతికి ముందు వెళ్తారు. అక్కడి అమరలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి వెళ్తారు. అక్కడ సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం పాలకొల్లు బయలుదేరి వెళ్లి అక్కడి క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామానికి బయలుదేరతారు. అక్కడ భీమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. అక్కడి నుంచి చివరిగా కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారభీమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత బస్సు కాకినాడ డిపోకి చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్యాకేజీలో భాగంగా కేవలం బస్సు ప్రయాణం మాత్రమే ఉంటుంది. ఆహారం, అక్కడి ఎంట్రీ టికెట్లు వంటివి యాత్రికులే చూసుకోవాలి.

టికెట్ బుకింగ్ ఇలా..

ప్రత్యేక బస్సులకు టికెట్‌లను కాకినాడ బస్ డిపోలో, ఆన్‌లైన్‌లో, ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద ముందుగా పొందవచ్చు. భక్తులు బస్సు సరిపడా ఉండి కోరితే కావాల్సిన ప్రదేశానికి బస్సులు నేరుగా కూడా పంపుతారు. అద్దె ప్రాతిపదికన కూడా మొత్తం బస్సును బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఆయా బస్సుల రిజర్వేషన్ కోసం 9959225564, విచారణ కోసం 9959225543 నెంబర్లను సంప్రదించవచ్చు.

తుఫాన్ ప్రభావంతో తొమ్మిది సూపర్ ఫాస్ట్

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

సామర్లకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల తీరప్రాంతాలలో మరికొద్ది గంటలలో రానున్న డానా తుపాన్ కారణంగా విశాఖ నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగించే పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను 23, 24 తేదీల్లో రద్దు చేసినట్లు మంగళవారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారు లకు సమాచారం అందింది. అధికారుల నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది. హౌరా-ఫలక్‌నుమా మధ్య నడిచే (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, సిల్చార్-సికింద్రాబాద్ మధ్య నడిచే (12514) ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 23న రద్దయ్యాయి. ఖర్గ్‌పూర్-విల్లుపురం మధ్య నడిచే (22603) ఎక్స్‌ప్రెస్, షాలీమార్- హైద రాబాద్ మధ్య నడిచే (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగుళూరు మధ్య నడిచే (12863) ఎక్స్‌ప్రెస్, షాలీమార్- వాస్కోడిగామా మధ్య నడిచే (18047) ఎక్స్‌ప్రెస్, హౌరా-చెన్నై మధ్య నడిచే (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్, పాట్నా-ఎర్నాకుళం మధ్య నడిచే (22644) ఎక్స్‌ప్రెస్, సత్రాగంచి-చెన్నై మధ్య నడిచే (06090) ఎక్స్‌ప్రెస్‌లు 24న రద్దయ్యాయి. ఆయా రైళ్ళల్లో రిజర్వేషన్‌తో ప్రయాణించేవారు ఆయా తేదీలలో రద్దు సమయాలను పరిశీలిం చుకుని తమ ప్రయాణాలను మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు. రద్దు అయిన రైళ్ళ వివరాలు, రిజర్వేషన్ టిక్కెట్ల రుసుములు చెల్లించడం వంటి సమాచారం సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ సమాచారంలో తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పాదగయ ఈవోగా జగన్మోహన శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం సహాయ కమిషనరు, కార్యనిర్వహణాధికారిగా కాట్నం జగన్మోహన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. శనివారమే జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన ఈయన మంగళవారం ఇప్పటి వరకు ఈవోగా పనిచేసి తుని లోవ దేవస్థానం డిప్యూటీ కమిషనరు, ఈవో పి.విశ్వనాథరాజు నుంచి చార్జి తీసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఈవో తెలిపారు. ఈయన ప్రస్తుతం రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పెద్దాపురం మహారాణి సత్రం ఇన్‌చార్జి ఈవోగా పని చేస్తున్నారు. పాదగయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన గతంలో పెనుకొండ వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానం, చదలవాడ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (తొలి తిరుపతి) ఈవోగా పనిచేశారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెన్నిస్ జట్ల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కాకినాడ అర్బన్, అక్టోబరు 22: కాకినాడలోని జిల్లా క్రీడా మండలి మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెన్నిస్ అండర్-17, 19 విభాగాల్లో బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్టు కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామ్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కోశాధికారి రవిసుందర్‌కార్, సహాక కార్యదర్శులు జి.సు నీల్‌కుమార్, కె.పరుశురామ్, అండర్-19 కార్యదర్శి రత్న శామ్యూల్, పీడీలు మంగాయమ్మ, బీటీ వర్మ, వి.నీలిమ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు....

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్... కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉ న్నాయి. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నవంబరు 8న సర్టిఫికెట్ల పరిశీలన జరు గుతుంది. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్లలో ఖాళీలు లేకపోతే వేరే జిల్లాలో పని చేసేందుకు అంగీకార పత్రం రాసి ఇవ్వాలి. మరిన్ని వివరాలకు 08922-294906 నెంబరును సంప్రదించవచ్చు.

ఐటీఐల్లో ప్రవేశానికి...

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేటల్లోని ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశా నికి 5వ విడత నోటిఫికేషన్ విడుదలైంది. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు దగ్గరలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రాలతో హాజరై ఈ నెల 27వ తేదీలోపు వెరిఫికేషన్ చేసుకోవాలని కాకినాడ జిల్లా కన్వీనర్ ఎంజీజీ వర్మ సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు మెరిట్ జాబితాకు పరిగణించమని చెప్పారు.


సిల్టును తొలగిస్తున్న దృశ్యం

పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగింపు

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ పుష్కరిణిలో సిల్టు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. మహాలయ అమావాస్య పర్వదినాల సమయంలో పిండ ప్రదానాలు నిర్వహించి వాటిని పుష్కరిణిలో కలపడం వలన నీరు రంగు మారడంతో పాటు అందులో వ్యర్థాలు ఉండిపోయాయి. దీంతో నీటిని తొలగించారు. ఈలోగా దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవార్ల తెప్పోత్సవం కోసం మరలా నీరు పెట్టారు. పుష్కరిణిని శుభ్రం చేయకుండానే నీరు పెట్టడంతో రంగు మారింది. తెప్పోత్సవం ముగియగానే నీటిని పూర్తిగా తొలగించారు. నవంబరు 2వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న



నేపథ్యంలో పుష్కరిణిని శుభ్రం చేయాలని నిర్ణయించారు. 40 మంది కార్మికులను వినియోగించి రెండు రోజులుగా పుష్కరిణిలో సిల్టును తొలగించి ట్రాక్టర్ల సహాయంతో తరలిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆలయ పూర్వ సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు, ప్రస్తుత ఈవో కేజేఎం శ్రీనివాస్ తెలిపారు. పూర్తిగా బురద తొలగించి కొత్త నీరు పెడతామని వారు చెప్పారు.


2013లో ఆత్మహత్య చేసుకున్న కిరణ్ కుటుంబ సభ్యులు (పాత చిత్రం)

వ్యాపార లావాదేవీలతో ఎంతో ఉన్నతంగా బతికి వందలాది మందికి జీవనోపాధి కల్పించిన ఆ కుటుంబం నేడు ఛిన్నాభిన్నమైంది. ఆర్థిక సమస్యలో, ఆరోగ్య సమస్యలో తెలియదు గానీ ఆ కుటుంబంలోని వారు వరుసగా ఆత్మహత్యకు పాల్పడుతుండడం సంచలనమైంది. 2013లో కుమారుడు, కోడలు, మనుమలు ఆత్మహత్య చేసుకున్నారు. నేడు తల్లిదండ్రులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.


మంగళవారం ఆత్మహత్య చేసుకున్న రాంబాబు-నాగమణి దంపతులు (పాత చిత్రం)

కష్టాలే కడతేర్చాయా!

» 11 ఏళ్ల కిందట కొడుకు, కోడలు, మనుమల ఆత్మహత్య... నేడు తల్లిదండ్రులు » అంబాజీపేటలో విషాదఛాయలు

అంబాజీపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పెద్ద వీధికి చెందిన పాబోలు రామసుబ్రహ్మణ్యం, కుమారుడు వెంకటకిరణ్ 2010కి ముందు అంబాజీపేటలో ఆయిల్‌మిల్లు ఏర్పాటు చేశారు. లాభాలు ఆర్జించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. అదే సమయంలో అయినవిల్లి మండలం సిరిపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరి నూనె వ్యాపారం చేసేందుకు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. అయితే అందుకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. నెలల తరబడి నిరసన తెలిపి ధర్నాలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు ఫ్యాక్టరీని ప్రారంభించారు. అయితే తీవ్ర నష్టాలు రావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. అప్పటి నుంచీ తీవ్ర సమస్యలతో సతమతమవుతోంది. దీంతో కుమారుడు కొన్ని ఆస్తులను విక్రయించేందుకు చర్యలు చేపట్టాడు. అయినా ఆర్థికంగా కోలుకోలేక పోయారు. 2013 అక్టోబరు 10న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో పాబోలు రాంబాబు కుమారుడు వెంకటకిరణ్, కోడలు లక్ష్మీశ్వేత, మనుమరాలు శ్రావణి, తొమ్మిది నెలల మనుమడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆ నాటి నుంచీ మనోవేదనకు గురైన రాంబాబు-నాగమణి దంపతులు కుమార్తె సాయంతో జీవిస్తున్నారు. అంబాజీపేట పెద్ద వీధిలో ఆదిత్య గార్మెంట్స్ షాపు పెట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ వ్యాపారంలోనూ నష్టాలు వచ్చాయి. కొవిడ్ సమయం నుంచీ ఆర్థిక ఇబ్బందులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రాంబాబు-నాగమణి దంపతులు మంగళవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిణామం స్థానికులను కలిచి వేసింది. బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు.



గుమ్మళ్లదొడ్డిలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శివగణేష్, ప్రధాన రహదారిపై బైఠాయించిన స్థానికులు

అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాల్సిందే

» గుమ్మళ్లదొడ్డిలో నిరవధిక దీక్షకు దిగిన శివగణేష్, సూర్యచంద్ర » ప్రధాన రహదారిని దిగ్బంధించిన ప్రజలు

గోకవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి సమీపంలో నిర్మించిన కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను వెంటనే తొలగించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. గుమ్మళ్లదొడ్డిలోని రామాలయం వద్ద చేపట్టిన దీక్షకు గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ నివాస గృహాల మధ్య కాలుష్య కారకమైన పరిశ్రమను ఏవిధంగా ఏర్పాటు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా పరిశ్రమను స్థాపించి అనారోగ్యంపాలు చేస్తారా అని ప్రశ్నించారు. జనావాసాల మధ్య పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎలా అనుమతి అచ్చిందో అర్థం కావట్లేదన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పలుమార్లు ఉన్నతాధికారులను వివరాలు అడిగినప్పటికీ కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామం నుంచి పరిశ్రమను తరిమికొట్టే వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ కాలుష్యకారక పరిశ్రమను జనసేన ప్రోత్సహించదన్నారు. ఈ విషయాన్ని తమ అధినాయకుడి దృష్టికి తీసుకెళ్తానన్నారు. చుట్టూ చమురు కంపెనీలు ఉండగా మధ్యలో అత్యంత ప్రమాదకరమైన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు హేయమైన చర్య అన్నారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు ప్రధాన రహదారిని దిగ్బంధించారు. రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు, రంపచోడవరం వైపు వచ్చే వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన కారులు ప్రధాన రహదారిపై నుంచి దీక్షా శిబిరం వద్దకు వెళ్లిపోయారు.


అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రావులపాలెం సీఐ విద్యాసాగర్, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఆలమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో ఈ నెల 15న జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ వెల్లడించారు. జొన్నాడకు చిటికెన సోమరాజు ఇంట్లో 312 గ్రాముల బంగారు వస్తువులను దొంగిలించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియస్ నారిగాడు, నెల్లూరు జిల్లాకు చెందిన మహబూబ్ బాషాలను మంగళవారం జొన్నాడ సెంటర్లో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 121 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వస్తువులను నెల్లూరు జిల్లాలో తాకట్టు పెట్టినట్టు గుర్తించారు. త్వరలోనే వాటిని తీసుకొస్తామన్నారు. కేసును ఛేదించడానికి కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, హెచ్‌సీ డి.సుబ్రహ్మణ్యస్వామి, సిబ్బంది ఎస్.టైసన్, పి.గంగాధర్, కె.రాంబాబు, బి.నెహ్రూ, బి.శ్రీనివాసరావు, కేవీవీ రవికుమార్, వి.చిట్టిబాబు కృషి చేశారు.

భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణపై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 60 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. చాలా కేసుల్లో జైలుకు వెళ్లాడు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో వున్న సమయంలో వెంకటనారాయణకు రాజ నెల్లూరు జిల్లాకు చెందిన మహబూబ్ బాషాతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక వారిద్దరూ కలిసి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చోరీలకు పాల్పడేవారు. జొన్నాడలో దొంగతనం జరిగిన ఇంటి వద్ద సీసీ కెమెరాలు లేవు. అయితే పరిసరాల్లోని సీసీ ఫుటేజీ ద్వారా వీరిని గుర్తించి పట్టుకున్నట్టు సీఐ విద్యాసాగర్, ఎస్ఐ అశోక్ తెలిపారు.



హరినాథ్-ఉదయలక్ష్మి దంపతులు (పాత చిత్రం)

మరణంలోనూ... ఒక్కటిగానే...

భర్త మరణించిన రెండు గంటల్లోనే భార్య మృతి... ఇంద్రపాలెంలో అలుముకున్న విషాదం

కాకినాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ వృద్ధ దంపతులు. సుమారు ఐదు దశాబ్దాలకు పైగా కలిసి జీవితం పంచుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్య జీవితంలో ఇద్దరు కుమారులు, కోడల్లు, మనవళ్లతో ఏ చీకూచింతా లేకుండా వృద్ధాప్యంలో హాయిగా జీవితం గడచిపోతోంది. వృద్ధాప్యంలో సంభవించే అనారోగ్య రుగ్మతలతో భర్త ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించగా, ఆయన మరణాన్ని తట్టుకోలేక భార్య కూడా గుండెపోటుతో కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచింది. ఈ ఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో జరిగింది. ఇంద్రపాలెం గౌరీకేదారేశ్వర స్వామి ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న అరిగెల హరినాథ్ (78), అరిగెల ఉదయలక్ష్మి(72) భార్యభర్తలు. వీరికి సాయివెంకటేశ్వరరావు (బాబీ), విశ్వేశ్వరరావు (చిన్ని) కుమారులు. ఇద్దర్నీ పెంచి ప్రయోజకులను చేశారు. కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో ఆనందంగా జీవిస్తున్నారు. వృద్ధాప్యంలో పలు రకాల అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న హరినాథ్ సోమవారం రాత్రి మరణించాడు. తండ్రి మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చి ఫ్రీజర్‌లో పెట్టారు. ఇది చూసిన భార్య ఉదయలక్ష్మి తీవ్రంగా కుంగిపోయింది. కుమారులు, కోడళ్లు, బంధువులు బాధపడొద్దు అంటూ వారించారు. భర్త మరణాన్ని తట్టుకోలేక ఫ్రీజర్‌లో ఉన్న భర్త భౌతికకాయాన్ని చూస్తూనే రెండు గంటల వ్యవధిలోనే భార్య తనువు చాలించింది. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో కుమారులు సాయివెంకటేశ్వరరావు (బాబీ), విశ్వేశ్వరరావు (చిన్ని) కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంతో అన్యోన్యంగా జీవితాంతం ఆనందంగా గడిపిన తల్లిదండ్రులు ఇలా రెండు గంటల వ్యవధిలోనే మృతి చెందారని కుమారులు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న మణికుమార్

మణికుమార్‌కి 'ఆంధ్రరత్న' పురస్కారం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నాదస్వర కళాకారుడు తొనంగి మణికంఠకుమార్ 'ఆంధ్రరత్న' పురస్కారం అందుకున్నారు. విజయవాడలో ఆయనకు అన్నమయ్య జిల్లా మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, కన్నడ నటి పంకజ అవార్డు చేశారు. ఈ సందర్భంగా మణికంఠను నగరంలోని సుబ్బారావు నగర్‌లో గల ఆయన స్వగృహంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కోనంగి రామారావు, పెద్దసాయిబాబా, బర్రే కొండబాబు, గారెడ పైడిరాజు, విజనగిరి బంగారు రాజు అభినందించారు.


నార్కెడిమిల్లి వద్ద గోదావరిలో గాలింపు చర్యలు, ఇన్‌సెట్‌లో గల్లంతైన అభిషేక్ (పాత చిత్రం)

గోదావరిలోకి జారి బాలుడి గల్లంతు

ఆత్రేయపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి శివారు శెట్టిబలిజపాలేనికి చెందిన 13 ఏళ్ల పిల్లి అభిషేక్ ఆదివారం సాయంత్రం సహచర మిత్రులతో కలిసి గోదావరి వద్దకు మలవిసర్జనకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారడంతో అభిషేక్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు మూడు రోజులుగా గాలిస్తున్నారు. అభిషేక్ 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడిని ప్రయోజకుడిని చేయాలనే తలంపుతో తల్లి నాగలక్ష్మి అప్పు చేసి 21 రోజుల క్రితమే దుబాయ్ వెళ్లింది. కొడుకు గల్లంతయ్యాడన్న సమాచారంతో హుటాహుటిన అక్కడి నుంచి తిరిగి వచ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు జాడ తెలియకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. బిడ్డ కోసం ఆ తల్లి పడిన వేదన స్థానికులను కలచివేసింది.

భర్త మందలించాడని ఆత్మహత్య

పిఠాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. భర్త మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న పిఠాపురానికి చెందిన అనసూరి దుర్గాప్రసాద్, నర్సీపట్నానికి చెందిన నాగలక్ష్మి(28)కి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు పట్టణంలోని హెచ్‌పీ కంపెనీ సమీపంలోని అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఆటోతో వెళ్లిన దుర్గాప్రసాద్ మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో నాగలక్ష్మి ఫోన్ మాట్లాడుతూ పట్టించుకోకపోవడంతో దుర్గాప్రసాద్ మందలించాడు. కోపంతో కేకలు వేసి తిరిగి బయటకు ఆటోతో వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి తలుపులు వేసి ఉండడంతో అనుమానం వచ్చి బద్దలుకొట్టి లోపలకు వెళ్లగా నాగలక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. వివాహిత తమ్ముడి ఫిర్యాదు మేరకు పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

జనసైనికుల వేధింపులే కారణమంటున్న బాధితురాలి భర్త

కరప, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేస్తున్న పులపకూర సునీత మంగళవారం ఉదయం నిద్రమాత్రలు, బైల్స్ గమ్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకుంటోంది. స్థానిక జన సైనికుల వేధింపులే దీనికి కారణమని ఆమె భర్త వీరబాబు ఆరోపిస్తున్నాడు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సునీతపై మూడు నెలలుగా స్థానిక జనసేన నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటా నానిబాబు, వీరమహిళ గుబ్బల భవానీ తదితరులు ఫీల్డ్ అసిస్టెంట్ సునీతను తప్పించి తమకు కావాల్సిన వ్యక్తిని నియమించుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రతినెలా తమకు డబ్బులు ఇవ్వాలని, లేకపోతే ఉద్యోగం లేకుండా చేస్తామని సునీతను అసభ్య పదజాలంతో బెదిరించారని ఆమె భర్త వీరబాబు ఆరోపించాడు. ఈ ఘటనకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అతను డిమాండ్ చేశాడు. తమపై వస్తున్న ఆరోపణలను జనసేన నాయకులు బండారు మురళి, గంటా నానిబాబు ఖండించారు. ఆమెను డబ్బులు డిమాండ్ చేసినట్టు, అసభ్యంగా మాట్లాడినట్టు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ సునీత పలు అవకతవకలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు, ఉపాధి కూలీల సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని ఈనెల 5వ తేదీన డ్వామా పీడీ, కరప ఏపీవోలకు అందజేశామన్నారు. రెండు రోజుల్లో అధికారులు దీనిపై విచారణకు రానున్నారని వారు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్ఐ తోట సునీత చెప్పారు.


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ సునీత

జనవరి 15 వరకు గ్రామస్థాయి జన సురక్ష : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 15నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు భీమాపథకాలు అన్నివర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాష్ట్రలీడ్ బ్యాంకు ఆదేశాల మేరకు లీడ్ బ్యాంక్ కార్యాలయం తూర్పుగోదావరి జిల్లా వారి సహకారంతో కేంద్ర ప్రభుత్వ భీమా పథకాలు అయిన ప్రధాన మంత్రి సురక్షభీమా యోజన కేవలం రూ.20 చెల్లింపుతో రెండు లక్షల ప్రమాదబీమా కవర్ అవుతుందని ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగినా ఇది వర్తిస్తుందన్నారు. ఈ పథకం 18-70 మధ్యవయస్సు వరకు బ్యాంక్ ఖాతా కలిగిన అందరూ అర్హులని తెలిపారు. ప్రతి ఏటా ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం మొత్తం బ్యాంక్ ఖాతా నుంచి చెల్లి స్తారన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కేవలం రూ.436 ప్రీమియంతో రూ.2లక్షలు జీవిత బీమాసౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజరు డీవీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీ ఎస్ మూర్తి ఇంచార్జి డీపీపీవో ఎం.నాగలత పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులు వాటి ఉపకరణాలతో అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలక్ట్రికల్ ఉపకరణాల విషయంలో ఎల్లప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లో రిఫ్రిజిరేటర్ మొదలుకొని ఇతర పరికరాలు శుభ్రపరిచే క్రమంలో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. స్విచ్‌బోర్డులను తడిచేయితో ముట్టుకోకూడదు, హీటర్ వాడేటప్పుడు స్విచ్ ఆఫ్ చేయకుండా నేరుగా తాకరాదని, చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు విద్యుత్ వైర్లలో చిక్కుకుపోయిన నేరుగా తాకరాదు, తడికర్ర, ఐరన్ ఊచలతో తీయరాదు. ఇళ్లనిర్మాణంలో ఇనుప గొట్టాలు, ఇనుప చువ్వలు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలకు తగలకుండా చూసుకోవాలి. ఇంట్లో ఉన్న ప్రతి ఎలక్ట్రికల్ పరికరానికి సమగ్రమైన ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలి, రహదారులపై వాహనాల్లో వెళ్లేటప్పుడు ఆయా వాహనాలకు విద్యుత్ వైర్లు తగిలినప్పుడు వాహనంలో ఉన్నవారు గెంతడం, దూకడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చు, పొలంలో మోటారు స్విచ్‌ను తడిచేత్తో చెప్పులు ధరించకుండా వేయడం, ఆపడం చేయరాదు, రొయ్యలు, చేపల చెరువులవద్ద వినియోగించే విద్యుత్‌కు సంబంధించి వైర్లు నేలపై ఉంచుతూ సరఫరా ఇవ్వరాదని తదితర జాగ్రత్తలు ఎస్ఈ తెలిపారు. ఎదైన ప్రమాదం జరిగినప్పుడు విద్యుత్ శాఖ అధికారులకుగాని లేదా 1912 టోల్ ఫ్రికి సమాచారం ఇవ్వాలని కోరారు.

వాసవీ క్లబ్ ద్వారా స్ఫూర్తివంతమైన సేవలు

● ఏపీఐఐసీసీ మాజీ చైర్మన్ శివరామసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 22: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్‌ద్వారా సమాజానికి స్ఫూర్తివంతమైన సేవలు అందిస్తున్నారని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కాతేరు వెంకటాద్రి కల్యాణ మండపంలో మంగళవారం వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ వి215ఏ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ డిస్కాన్ 2024 వేడుకగా జరిగింది. కాన్ఫరెన్స్ చైర్మన్ బోడా సాయి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో క్లబ్ గవర్నర్ కాళ్ళకూరి వీవీఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శివరామసుబ్రహ్మణ్యం విశిష్ఠ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ అన్నారు. క్లబ్ గవర్నర్ రవిచంద్రన్ మాట్లాడుతూ పేద మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేయడం ద్వారా వారు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పాటును అందిస్తుందన్నారు. క్లబ్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తమ వాసవీ క్లబ్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. నూతన గవర్నర్‌గా యెండూరి రాఘవకుమారి ఎన్నికయ్యారు. బోడా ప్రకాష్, క్యాబినెట్ సెక్రటరీ గ్రంధి సురేష్, ట్రెజరర్ కేసవరపు నాగప్రశాంత్, వైస్‌ప్రెసిడెంట్ గార్లపాటి శ్రీనివాసులు, కరుణాకుమార్, వివిధ క్లబ్‌ల నుంచి 1200మంది సభ్యులు హాజరయ్యారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మలకపల్లి గ్రామంలో మంగళవారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ కంటి వైద్యశాల సిబ్బంది శిబిరంలో వైద్య సేవలందిం చారు. శిబిరంలో 100 మందికి పైగా హాజ రుకాగా వీరిలో 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, 11 మందికి కళ్లజోళ్లు అందిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు కుంటముక్కల వీరభద్రరావు తెలిపారు. మార్ని రామమూర్తి, మద్దిపాలి ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి : ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రూరల్ మండలం బొమ్మూరు, రాజవోలు గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధి కూటమి లక్ష్యం అన్నారు.కార్యక్రమంలో భాగంగా బొమ్మూరు పరిధిలో గల వీరభద్రరావు కాలనీలో రూ. కోటి, రాజవోలు గ్రామంలో రూ.55లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, లింకురోడ్లు, పనులు చేపడుతున్నామన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదన్నారు. స్థానికులు కూడా పనులను పర్యవేక్షించాలని సూచించారు. వీరబద్రకాలనీలో తమ ప్రాంతంలో కరెంటులో వోల్టేజ్ సమస్య ఉందని వాటిని పరిష్కరించాలని, అదేవిధంగా దొంగతనాలు తరచూ జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక మహిళలు తీసుకొచ్చారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని, విద్యుత్ శాఖ అధికారులకు, ఈ ప్రాంతంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేయాలని పోలీసులకు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని కూడా పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. రాజవోలు గ్రామంలో బరియల్ గ్రౌండ్ ఆధునికీకరణక పనులకు రూ.10లక్షలు మంజూ రు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, కామిని ప్రసాద్, భాస్కరరావు, నిమ్మలపూడి రామకృష్ణ, భీమరశెట్టి రమేష్, పలివెల సత్యన్నారాయణ, యంపిడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కుమార్, గ్రామ కార్యదర్శి కాశీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



పల్లెపండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

సీఎం సహాయనిధి చెక్కుల అందచేత

కడియం: పేద ప్రజల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన వాసా సూరిబాబుకు రూ. 35,688 వేమగిరి గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణకు రూ. 30,000 సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల అందజేశారు. చెల్లుబోయిన శ్రీనివాస్, ఆళ్ళ ఆనందరావు, గుత్తుల కృష్ణ, ఈదుపుగంటి హరిప్రసాద్, తమ్మ నాగేంద్ర, వాసా శ్రీను ఉన్నారు.

'మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి'

బిక్కవోలు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని బిక్కవోలు ఎంఈవో పూర్ణచంద్రరావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన బలభద్రపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. సిలబస్ ప్రకారం బోధన జరపాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం స్వీకరించారు. ఈయన వెంట హెచ్‌ఎం పి.బులివెంకటరెడ్డి ఉన్నారు.

జాబ్‌మేళాలో 37 మంది ఎంపిక

రాజానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 37 మంది ఎంపికైనట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎస్‌డీవో ఎం.పెరుమాళ్ రావు తెలిపారు. ఈమేళాలో 69 మంది అభ్యర్థులు హాజరు కాగా 37మంది ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు రాజ మహేంద్రవరం, నిడదవోలు, రావులపాలెం, విజయవాడ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజానగరం ఎంపీడీవో జేప ఝాన్సీ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ జేఈ రవి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గణేష్ పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు



బిక్కవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బహుళషష్ఠి సందర్భంగా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. కుజ, రాహు, కాల, సర్ప దోష నివారణార్థం అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యం, కొడమంచిలి సత్యనారాయణశర్మలు భక్తులతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

రాజమహేంద్రవరంలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 22: చారిత్రక రాజమహేంద్రవరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు కోరారు. మంగళవారం అడ్వకేట్స్ వెల్ఫేర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్నాలకోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల అనంతరావు, అల్లంకి శివప్రసాద్,సహ కార్యదర్శి బీర అరుణ్‌కుమార్, సెక్రటరీలు కుంచె రాంబాబు,దీపాటి శ్యాంబాబుల రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్ర అందజేశారు. హైకోర్టు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తే ముఖ్యంగా ఉత్తర,దక్షిణ కోస్తా ప్రజలకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించి హైకోర్టు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే బీజేపీ వారధి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరి ష్కార దిశగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వారధి కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో వారధి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వారధి కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు స్వీకరించ డమే కాకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వారధి సమన్వయకర్త కిలారి దిలీప్ పాల్గొన్నారు



విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో వారధి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బీజేపీ సభ్యత్వ నమోదులో రెండో స్థానం

కోరుకొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా బీజేపీ రోజురోజుకు బలపడుతుందని ఇందుకు నిదర్శనమని సభ్యత్వ నమోదులో రాజానగరం నియోకవర్గం రెండో స్థానంలో నిలిచిందని ఆ పార్టీ ఇన్‌చార్జ్ కోరుకొండ వీరన్నచౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కోరుకొండలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం ప్రజలు భారతీయ జనతా పార్టీవైపు మొగ్గు చూపుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నియోజకవర్గానికి అందిస్తున్న సహకారంతో రాజానగరం నియోజకవర్గంలో 19,440 ఆన్‌లైన్ సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకు సహకరించిన పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్, మండల శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, బీజేపీ అనుబంధ కమిటీలు చేసిన కృషిని వీరన్న చౌదరి అభినందించారు.

మంగళగిరి జనవాణిలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు నేరుగా తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో జనవాణి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. అమరావతిలో మంగళవారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి జనవాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాల్లోని ప్రజలు అనేక సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు.



ప్రజలు సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

అధికారుల మన్ననలు చూరగొనండి

● పంచాయతీ కార్యదర్శులకు ఘన సత్కారం



పంచాయతీ కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో పంచాయతీ కార్యదర్శులు అధికారుల మన్ననలు అందుకోవాలని ఎంపీడీవో జేప ఝాన్సీ పేర్కొన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో మంగళవారం వీడ్కోలు పలుకుతూ ఘనంగా సత్కరించారు. మండలంలో పాతతుంగపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ రంగంపేటకు బదిలీ అయిన శ్రీరామ్మూర్తిని, చక్రద్వారబంధం నుంచి జేగురుపాడుకు బదిలీపై వెళ్లిన అయినవిల్లి శ్రీనివాసరావును, పరిజెల్లిపేట నుంచి కోరుకొండ మండలం నర్సాపురానికి బదిలీ అయిన సూరిబాబును, భూపాలపట్నం నుంచి కేశవరం బదిలీ అయిన ఎస్.సుబ్బారావును, తోకాడ నుంచి జగ్గంపేట మండలం రామవరం బదిలీ అయిన శివ, ఈవోఆర్డీగా పనిచేస్తూ కృష్ణాజిల్లా జి.కొండూరుకు, కె.శ్రీనివాసరావు ఎంపీడీవో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈవోపీఆర్డీ ఎన్‌వీవీఎస్ఎన్ లక్ష్మి(వాణి), సూపరింటెండెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతా రద్దు చేసి నగదు ఇప్పించండి

● కమిషనర్ కేతన్‌కు ఏపీటీఎఫ్ వినతి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసిన కారణంగా వారి పీఎఫ్ ఖాతాలను రద్దుచేసి నగదు రూపంలో ఇప్పించాలని ఏపీటీఎఫ్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌ను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం, జిల్లాగౌరవాధ్యక్షుడు అప్పయ్యశాస్త్రి, నగర అధ్యక్షుడు కె.డెవిడ్ లివింగ్‌స్టన్‌లు కలిసి విన్నతిపత్రం అందించారు.



కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎస్ నాయకులు

కవి పోచిరాజు శతజయంతి

అనపర్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : తెలుగు ఉపాధ్యాయుడిగా జీవితం ప్రా రంభించి అనేక రచనలు చేసిన కవి పోచిరాజు శేషగిరిరావు చిరస్మరణీయుడని ప్రముఖ నేత్ర వైద్యుడు తేతలి సత్యనారా యణరెడ్డి అన్నారు. ప్రముఖ కవి పోచిరా జు శేషగిరిరావు శత జయంతి వేడుకలను మంగళవారం అనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు భాషాభిమానుల సం ఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల ప్రాంభమైన 1947నుంచి 58 వరకు పాఠశాల ప్రదానోపాధ్యాయుడిగా పోచిరాజు పనిచేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. మరో అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ తహసీల్దార్ గౌరినాయుడు మాట్లాడుతూ పోచిరాజు జీవిత విశేషాలను, ఆయన రచనలను సభికులకు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభిమానుల ఆధ్వర్యంలో వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ తాడి రామగుర్రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ పార్వతి, వైస్ చైర్మన్ రాజేశ్వరి, సంఘ ప్రతినిధులు చెల్లారెడ్డి, వైబీఎస్ ఆచార్యు లు, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కవి పోచిరాజు శత జయంతి సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్యులు సత్యనారాయణరెడ్డి సత్కరిస్తున్న ప్రతినిధులు

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● రాజమహేంద్రవరం-విశాఖపట్నం నూతన బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం త్వరలోనే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేయనుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రాజమహేంద్రవరం-విశాఖపట్నం నూతన బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, సుఖవంతం అని, ఆర్టీసీ వ్యవస్థ అంటే ప్రజలకు ఒక నమ్మకం అని అన్నారు. ఆర్టీసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కొత్త బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి నుంచి రాష్ట్రంలో ఉచితగ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం నిర్వహిస్తుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరం 29వ డివిజన్ కొత్తపేట రైల్వేగేటు సమీపంలో 6, 21, 22, 23, 24, 25, 29, 30, 31, 32, 33 డివిజన్లకు సంబంధించి ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను విన్నారు. ప్రజల నుంచి వచ్చిన పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ ఇంటిస్థలం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టీడీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జిలు, మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులు సేకరించిన విరాళాలు అందజేత

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరంలో రెండు విద్యాసంస్థలకు చెందిన చిన్నారులు సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు చెక్కులరూపంలో అందించారు. మంగళవారం స్థానిక సంజీవయ్యనగర్‌లో శ్రీబాలాజీ విద్యానికేతన్ విద్యార్థులు సేకరించిన రూ.20వేలు చెక్‌ను, మునిసిపల్ కాలనీకి చెందిన ప్రతిభ ఒకేషనల్ నర్సింగ్ కళాశాల వారు సేకరించిన రూ.10వేలు చెక్కులను టీడీపీ నాయకుడు బేసరి చిన్ని ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాదా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, నాయకులు విశ్వనాదరాజు, మేడికొండ అప్పారావు ఆయావిద్యాసంస్థల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతికి 22వ వార్షికోత్సవ శుభాభివందనములు
గ్రామ ప్రజలకు...దసరా మరియు దీపావళి శుభాకాంక్షలతో...
శ్రీమతి డి. పురందేశ్వరి, పార్లమెంట్ సభ్యురాలు, రాజమహేంద్రవరం
శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శాసనసభ్యులు, రాజమహేంద్రవరం రూరల్
శ్రీమతి పి. ప్రశాంతి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్
శ్రీ కేతన్ గార్గ్, రాజమహేంద్రవరం కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ ప్రత్యేక అధికారి
శ్రీమతి ఎమ్. నాగలత, జిల్లా పంచాయితీ అధికారి, తూర్పు గోదావరి జిల్లా
అభివృద్ధి పథంలో...

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 23 అక్టోబరు 2024 | 5

అక్షరం.. ఆయుధమై!

అక్షరమే ఆయుధమైంది.. ప్రజల సమస్యలపై గళమెత్తింది.. అధికారులను పరుగులు పెట్టించింది.. సమస్యల పరిష్కారంలో ఆంధ్రజ్యోతి సత్తాచాటింది.. గోకవరం రెవెన్యూ కార్యాలయంలో అర్ధరాత్రి అవినీతి గబ్బిలాల జాడ చూపింది.. స్పం దించిన ఉన్నతాధికారులు విచారణలో దిగారు.. ఇక రైల్వే స్టేషన్‌లో చెత్త కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేయడంతో ఏకంగా కాంట్రాక్టు సంస్థ మారిపోయింది.. మరో వైపు నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ అంటూ ప్రశ్నించడంతో జేసీ చిన్నరాముడు రంగంలోకి మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోకవరంలో దందాపై ఆర్డీవో విచారణ

గోకవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలంలోని రెవెన్యూ శాఖలో అవినీతి గబ్బిలాలను పట్టుకునేందుకు ఉన్నతాధికారుల విచారణకు దిగారు. అవినీతి గబ్బిలాలు శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి రంగంలోకి దిగారు.స్థానిక తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి నివేదిక అందజేయాలని ఆదేశించారు.మంగళవారం రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణానాయక్ రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని విచారణ నిర్వహించారు. సుమారు 12 మంది వీఆర్వో లను, కార్యాలయ సిబ్బందిని ఒక్కొక్కరిని తహశీల్దార్ గదిలోకి పిలిచి ఒంటరిగా విచారణ చేసినట్టు తెలిసింది. ఏ గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు..ఎన్నేళ్లగా ఈ మండ లంలో కొనసాగుతున్నారు.. ఎవరిపై ఏమేమి ఆరోపణలు ఉన్నాయి తదితర వివరాలపై వీఆర్వోల నుంచి ఆర్డీవో ఆరా తీశారు.

రైల్వేస్టేషన్ పారిశుధ్య కాంట్రాక్టు రద్దు

రాజమహేంద్రవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ పారిశుధ్య కాంట్రాక్టును రద్దు చేస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ అపారిశుధ్యంతో కంపుకొడుతుండడం, నెలల తరబడి వ్యర్థాలు టన్నుల్లో పేరుకుపోవడంపై 'స్వచ్ఛత నహీ' శీర్షికన ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. డివిజనల్ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. అప్పటికే ఆగస్టు 8,అక్టోబరు 7న ఇచ్చిన నోటీస్‌లపై తగు చర్యలు తీసుకోకపో వడాన్ని తప్పుబట్టారు.గతేడాది 29న హైదరాబాద్‌కి చెందిన ఎస్ఆర్ ఎంటర్ ప్రైజస్‌తో చేసుకున్న పారిశుధ్య కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేస్తూ సోమవారం(21న) సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎం.కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరా బాద్‌కి చెందిన ఫైవ్‌స్టార్ ఎంటర్‌ప్రైజస్ సంస్థకు తాత్కాలికంగా పారిశుధ్య బాధ్యతలు అప్పగించినట్టు చెబుతున్నారు.

ప్రతి ధాన్యం గింజ కొంటాం : జేసీ

నల్లజర్ల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని జేసీ చినరాముడు అన్నారు.ఈ నెల 19వ తేదీన నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలేవి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు.మంగళవారం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రాణి సుస్మిత,తహశీల్దార్ శాంతి ప్రియ,ఎంపీడీవో సింహాద్రిరావు పాల్గొన్నారు.

దారెటు : కడియం మండలం బుర్రిలంక ర్యాంపు వద్ద ట్రాక్టర్లు



ఇసుక..క్యూ

ఉచితమంటే.. దర్జాగా దోపిడీ





దర్జాగా లోడింగ్ : పెరవలి మండలం తీపర్రులో ఇలా..

- జిల్లాలో ఇసుక అక్రమ రవాణా
- సీఎం హామీతో గందరగోళం
- ర్యాంపులకు భారీగా ట్రాక్టర్లు
- ఇల్లు కట్టుకోనివారు క్యూ
- యథేచ్ఛగా ఇసుక తరలింపు
- ఖాళీ ప్రదేశాల్లో డంప్
- రాత్రికి ఇసుక అమ్మకాలు
- కరువైన పర్యవేక్షణ
- అడ్డుకోని అధికారులు

రాజమహేంద్రవరం/పెరవలి/సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉచితమంటే ఊరుకుంటారా.. అవసరం ఉన్నా లేకపోయినా క్యూ కట్టేయరూ..! ఫ్రీగా వస్తే పెనాయిల్ కూడా వదలరనేది గోదావరి నానుడి..ఆ నానుడిని గత మూడు రోజులుగా నిజం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నోట ఇసుక ఉచితం మాట అన్నప్పటి నుంచి అదే చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. నిబంధనలు మీరి తరలించేస్తున్నారు. దీంతో ఉచిత ఇసుక విధానం గందరగోళంగా మారింది.అవసరం మేరకు ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్లతోనూ ఇసుక తవ్వుకుని తీసుకుని వెళ్లొచ్చని సీఎం నారా చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన ప్రజల్లోకి తప్పుగా చేరినట్టు ఉంది.తూర్పుగోదావరి జిల్లాలో పలు ర్యాంపులు, లంకల్లోకి వందల కొద్దీ ట్రాక్టర్లతో ప్రజలు వచ్చి ఇసుక తవ్వుకుపోతున్నారు. రెండు రోజుల నుంచి ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తున్నారు. వాస్తవానికి వాగులు, నదులకు సంబంధించిన పిల్ల పాయల్లో ఇసుకను సొంతింటి అవసరాలకు ఉచితంగా ట్రాక్టర్లతో తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ గోదావరిలో కూడా ఉచితంగా ట్రాక్టర్లతో తవ్వుకోమని చెప్పినట్టు భావించిన ప్రజలు, ఇతరులు వందలకొద్దీ ట్రాక్టర్లను ఇసుక ర్యాంపుల్లోకి దింపి ఇష్టానుసారం ఇసుక తవ్వుకుపోతున్నారు. రెవెన్యూ, మైన్స్ అధికారులు ప్రశ్నిస్తే సీఎం గారే తవ్వుకోమంటే మీకేంటి అభ్యంతరం అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకూ ఏం చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. వేమగిరి- కడియపులంక ర్యాంపుల్లో మూడు రోజులుగా వందల ట్రాక్టర్ల ద్వారా ఎవరికి నచ్చినట్టు వారు ఇసుక తవ్వుకుపోతున్నారు. గత రెండు మూడు రోజులుగా పెరవలి మండలం తీపర్రు ర్యాంప్ నుంచి ఎగుమతులు జరుగుతుండగా పెండ్యాల ర్యాంప్‌లో సోమవారం నుంచి తవ్వకాలు ప్రారంభం అయ్యాయి. రెవెన్యూ అధికారులు ర్యాంప్‌ల వద్దకు వెళ్లి ఆరా తీయగా సీఎం ప్రకటనతో ఇసుక ఎగుమతి చేస్తున్నామని చెప్పడం గమనార్హం. సీతానగరం మండలం వంగలపూడి ర్యాంపులోనూ ట్రాక్టర్లు క్యూకడుతున్నాయి. ర్యాంపుల లోపలకు వెళ్లడానికి బాటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కేవలం ఇళ్ళు కట్టుకునే వారికి మాత్రమే అవసరానికి ఇసుక తీసుకువెళ్లడానికి అనుమతి ఉన్నప్పటికి ఉదయం నుంచి రాత్రి వరకు ఖాళీ లేకుండా ట్రాక్టర్లు పరుగులు తీస్తున్నాయి. గ్రామాల్లో ట్రాక్టర్ల అతివేగంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై వివరణ కోరగా పెరవలి, సీతానగరం తహశీల్దార్లు అచ్యుత కుమారి,ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ గృహనిర్మాణ అవసరాలకు మాత్రమే ఇసుక తీసుకువెళ్ళవచ్చు. ఇసుక నిల్వలకు అనుమతి లేదు. ముందుగా ట్రాక్టరు నమోదు చేయించుకోవాలి. లైసెన్సులు లేని ట్రాక్టర్లు, పిల్లలు డ్రైవింగ్ చేసిన ట్రాక్టర్లను సీజ్ చేస్తాం.ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపును ఉన్నతాధికారులకు తెలియజేశాం.. ఆదేశాలు మేరకు నడుచుకుంటామని తెలిపారు.

ఇంటి నిర్మాణానికే తరలించాలి..

ఉచిత ఇసుక విధానం అమలులో అవకతవకలకు పాల్పడినట్టు గుర్తించినా, అనుమతివ్వని ర్యాంపుల్లో తవ్వకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 16 రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు జారీ చేశాం. ఉచిత ఇసుక విధానంలో జిల్లా యంత్రాంగం గుర్తింపు ఇచ్చిన ప్రాంతాల్లో మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను పరిమితులకు లోబడి తీసుకువెళ్లాలి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం,మరమ్మతులకు మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకువెళ్లాలి. డంపు చేయడం, నిల్వ చేయడం కుదరదు.
- జేసీ ఎస్.చిన్నరాముడు

పెండ్యాలలో ఇసుక మాఫియా..

నిడదవోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం కొందరు దళారులు వరంగా మార్చుకుంటున్నారు. సామాన్యుల ఇళ్ల నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్న ప్రభుత్వ విధానానికి తూట్లు పొడుస్తూ ఇసుక మాఫియా అక్రమాలకు తెరలేపింది. నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి కొందరు ఇసుకాసురులు ఇసుక అక్రమ విక్రయాలకు తెరలేపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాక్టర్ల ద్వారా ర్యాంపుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లి పెండ్యాల, పరిసర గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో అనధికార స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని ఇసుకను డంప్ చేస్తున్నారు. రాత్రి కాగానే లారీల ద్వారా ఇసుక విక్రయాలు సాగిస్తున్నారు. ఫోన్‌కు డబ్బులు పంపితే లారీల ద్వారా ఇసుక ఇంటి ముంగిటకు చేరుస్తున్నారు. 20 టన్నుల ఇసుక లారీ ప్రభుత్వ ధరల ప్రకారం రూ.5400లు కాగా ఇసుకాసురులు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అవసరాన్ని బట్టి ధర నిర్ణయించి విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్క పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచే రోజుకు సుమారు 300 ట్రాక్టర్లకు పైగానే ఉచితంగా ఇసుక తరలిస్తుండగా 100 ట్రాక్టర్లు రోజుకు మూడు ట్రిప్పుల చొప్పున ఉదయం నుండి రాత్రి వరకు పెండ్యాల చుట్టు పక్కలే అనధికార ఇసుక డంప్‌లకు తరలిపోతుంది. పెండ్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం రోడ్డంతా అక్రమ ఇసుక నిల్వలకు అడ్డాగా మారిపోయింది. గ్రామంలోనే చిన్నా పెద్దా కలిపి సుమారు 40 నుండి 50 వరకు ఇసుక గుట్టలు ఉన్నాయి. పెండ్యాల ఇసుక ర్యాంపు నుంచి కొందరు అధికారులు, సిబ్బందికి భారీగా మామూళ్ళు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమాలకు రీచ్ : నిడదవోలు మండలం పెండ్యాల ర్యాంపులో ఇలా



పెండ్యాలలో గుట్టుగా.. ఇసుక గుట్ట

అక్రమాలకు దారి : సీతానగరం మండలం వంగలపూడి ర్యాంపునకు బాట

అనపర్తి మండలం కొప్పవరంలో డిస్టలరీ ఫ్యాక్టరీ



డిస్టలరీలపై.. సీఐడీ

- ఉదయం నుంచి తనిఖీలు
- 4 డిస్టలరీల్లో సోదాలు
- కీలక దస్త్రాలు స్వాధీనం
- నాటి అక్రమాలపై ఆరా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో జరిగిన మద్యం అక్రమాలను వెలికి తీసే పనిలో సీఐడీ దూకుడు పెంచింది. జిల్లాలోని డిస్టలరీలలో మంగళవారం ఏకకాలంలో తనిఖీలు చేశారు. వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యం విక్రయించే విధానాన్ని అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. మంచి బ్రాండ్లను ఆపేసి సొంతంగా మద్యం తయారుచేసి సొంత పేర్లతో నాసిరకం మద్యం విక్ర యించారు. డిజిటల్ లావాదేవీల ఊసే లేకుండా నగదు రూపంలో అమ్మకాలు చేసి లెక్కపత్రం లేకుండా వైసీపీ పెద్దలు దోచుకున్నారు.జిల్లాలో నెలకు రూ.150 కోట్లకు పైగా వ్యాపారం జరిగేది. కూటమి అధికారంలోకి రావడంతో మద్యం పాలసీని మార్చింది. దీంతో అప్పటి అక్రమాలపై దర్యాప్తును సీఐడీకి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే గతంలో వ్యవహారం నడిపిన ఉన్నతస్థాయి అధికారుల మెడకు ఉచ్చు బిగిసింది.అసలు ఈ అక్రమాల వెనుక ఎవరున్నారు.. ఎంత మేర అక్రమాలు జరిగాయనేది తేల్చడానికి సీఐడీ అధికారులు ఏకకాలంలో సోమవారం అన్ని చోట్ల సోదాలు మొదలు పెట్టారు.రాజమహేంద్రవరంలోని సీఐడీ రీజనల్ ఆఫీసు నుంచి ఏఎస్పీ హస్మా ఫర్వీన్ ఆధ్వర్యంలో సీఐడీ డీఎస్పీలు, సీఐలు, ఇతర సిబ్బంది, ఎక్సయిజ్ అధికారులు తదితరులు తనిఖీలు చేస్తున్నారు. కానీ ఏవిధమైన సమాచారం బయటకు చెప్పడం లేదు. లోపలకు వెళ్లి గేట్లకు తాళాలు వేసి తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో రంగంపేట మండలంలోని నల్లమిల్లిలో ప్రాగ్ మద్యం పరిశ్రమ, కోటపాడులోని మద్యం బాట్లింగ్ యూనిట్, అనపర్తి మండలం కొప్పవరం బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ తనిఖీలు జరుగుతున్నాయి. తాళ్లపూడి మండలం తుపాకుల గూడెంలో కూడా డిస్టిలరీ ఉంది. వైసీపీ హయాంలో భూంభూం బ్రాండ్ ఇక్కడ నుంచి వచ్చేదని సమాచారం. ఇక్కడ గతంలో ఏపీ బ్రాండ్లు తయారు చేసేవారు.. వైసీపీ హయాంలో ఏ బ్రాండ్లు తయారు చేశారు. ఎక్కడ నుంచి సరుకు వచ్చేది తదితర వివరాలు సేకరిస్తున్నారు. అప్పటి రికార్డులన్నీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. డిస్టిలరీల నిర్వాహకులను ఎక్కడికి కదలకుండా చేయడంతో పాటు అక్కడ పనిచేసేవారిని కూడా అదుపు చేసి వివరాలు ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సోదాలు జరుగుతూనే ఉన్నాయి. సీఐడీ అధికారులు మాత్రం తాము చేస్తున్న సోదాల గురించి లీకులు ఇవ్వడంలేదు.

కొప్పవరంలో కీలక దస్త్రాలు..

అనపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కొప్పవరంలోని బీడీహెచ్ ఆగ్రోవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై మంగళవారం సీబీఐ డీఎస్పీ భూపాల్ ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు దాడులు చేశారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం వరకు సాగాయి. తనిఖీల వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు. దాడుల్లో పలు కీలకమైన సమాచారం ఉన్న దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నియోజకవర్గంలోని మూడు డిస్టలరీలలోను గత నాలుగేళ్ళుగా మద్యం తయారీలేకుండా కేవలం బాట్లింగ్ యూనిట్లుగానే వీటిని నిర్వహించినట్టు సమాచారం.ట్యాంకర్ల ద్వారా వచ్చిన మద్యాన్ని ఇక్కడ ప్యాకింగ్ చేసి లేబుల్స్ అతికించి పంపించడమే జరిగినట్టు సమాచారం.

రంగంపేటలోనూ తనిఖీలు..

రంగంపేట,అక్టోబరు 22 : రంగంపేట మండలం కోటపాడు, నల్లమిల్లి బీరు ఫ్యాక్టరీలలో ఏకకాలంలో మంగళవారం ఉదయం 9 నుంచి అర్ధరాత్రి వరకూ విశాఖపట్నం నుంచి వచ్చిన సీఐడీ అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి సోదాలు చేశారు.సీఐడీ డిఎస్పీ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో కోటపాడు బీరు ఫ్యాక్టరీ, సీఐడీ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నల్లమిల్లి బీరు ఫ్యాక్టరీలోనూ గేట్లు తాళాలు వేసి ఎవరినీ లోపలికి అనుమతించకుండా సోదాలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వం అధికాంలో ఉన్న 2019 నుండి 2024 వరకు జరిగిన మద్యం తయారీ, అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్టు సమాచారం. కోటపాడులో ఉన్న ఫ్యాక్టరీ నెలకు ఒకకోటి ఏభై లక్షల మద్యం సీసాలను తయారు చేసే సామర్థ్యం కలిగిన ఫ్యాక్టరీ. సోదాల్లో మద్యం తయారీకి, అమ్మకాలకు భారీగా వ్యత్యాసం ఉన్నట్టు సీఐడీ అధికారులు గుర్తించినట్టు సమాచారం.ఫ్యాక్టరీలో ఉన్న రికార్డులను సీజ్ చేస్తున్నారని తెలిసింది. సోదాలు రెండో రోజు బుధవారం కొనసాగే అవకాశాలున్నాయి.

932 పాఠశాలలకు రూ.15 కోట్లు

బడులకు నిర్వహణ నిధులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఉపశమనం కలగనుంది. అనవసరమైన హంగామాకు పెద్దపీట వేసిన వైసీపీ ప్రభుత్వంలో చాక్‌పీస్‌లకూ డబ్బులు విడల్చలేదు. ఉపాధ్యాయులే తలోకొంత మొత్తం సేకరించుకొని పాఠశాల నిర్వహణ ఏర్పాట్లు చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ దారిద్ర్యానికి తెర వేసే ప్రయత్నం ఆరంభమైంది. పిల్లలకు విలువలతో కూడిన బోధనకు పెద్దపీట వేస్తోంది.ఈ క్రమంలో జిల్లా లోని 932 ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్వహణ ఖర్చులకు నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ని మంగళవారం జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాకు మొత్తం రూ.29.64 కోట్లు కేటాయించగా ప్రస్తుతం రూ.14.82 కోట్లు రానున్నాయి. యూడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. కరెంటు బిల్లులు చెల్లించడంతో పాటు చాక్‌పీస్‌లు, డస్టర్లు, పేప ర్లు, పెన్నులు వంటి ఆఫీస్ స్టేషనరీ వం టివి సమకూర్చుకోవాల్సి ఉంటుంది.ఈ మేరకు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడ్డ రైల్వే పారిశుధ్య కార్మికులు

- పాత కార్మికుల తొలగింపు
- 4 నెలల జీతమూ దిక్కులేదు
- కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగింత
- పనులకు బయట కార్మికులు
- విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



రాజమహేంద్రవరం,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులోని పారిశుధ్య కార్మికులు రోడ్డున పడ్డారు. ఏళ్ల తరబడి పొందుతున్న ఉపాధి అయోమయంలో పడింది. తమ దుస్థితిపై అధికారులకు విన్నవిస్తే అరెస్టు చేయిస్తామంటూ ప్రతాపం చూపించడంతో ఆంధ్రజ్యోతిని ఆశ్రయించారు. రైల్వే స్టేషనులో 20 మంది మహిళా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ట్రాక్, బాత్ రూమ్‌లు, ప్లాట్‌ఫాంలు, ప్రాంగణం, కార్యాలయాల క్లీనింగ్‌తో పాటు వ్యర్థాలను లారీలోకి ఎగుమతి చేసే బాధ్యత వీరిదే. వీరికి పారిశుధ్య కాంట్రాక్టరు రోజుకు రూ.504 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ పని చేయించుకున్న ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థకు రైల్వే కాంట్రాక్టు రద్దు చేసింది. అయితే ఆ సంస్థ ఇప్పటికే పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల జీతం బకాయి పడింది. హైదరాబాద్‌కి చెందిన మరో సంస్థకు తాత్కాలికంగా పారిశుధ్య బాధ్యతలను అప్పగించారు.ఆ సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌ని పారిశుధ్య పనివాళ్లు కలిసి తమకు 4 నెలల జీతం పాత కాంట్రాక్టరు ఇవ్వాలని చెప్పారు. ఆయన తమకు ఆ జీతం సంబంధం లేదని, తాము వేరే పనివాళ్లతో శుభ్రం చేయిస్తామని చెప్పారు. తాము ఉపాధి కోల్పోతుండడంపై స్థానిక అధికారికి కన్నీళ్లతో విన్నవించుకున్నారు. పని చెబుతాను కానీ పాత బకాయి ఇప్పించడం తాను చేయలేనని ఆ అధికారి బదులిచ్చారు. ఎక్కువగా వాదిస్తే అరెస్టు చేయిస్తా నంటూ బెదిరించారు. దీంతో ఆ మహిళా కార్మికులు ఉసూరుమంటూ రైల్వే కార్మి కుల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వద్దకు వెళ్లి తమ సమస్యను విన్నవించుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

2009 నుంచీ ఇక్కడే పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నాం. అప్పట్లో జీత భత్యాలు ఠంచనుగా ఇచ్చేవారు. తర్వాత పరిస్థితి మారింది. జీతం అడిగితే పనిలోకి వస్తే రండి లేకపోతే పొండి అని మాట్లాడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు అర్థం చేసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నాం.
- భాస్కరరావు, కన్నతల్లి దంపతులు

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : డీఈవో

దివాన్‌చెరువు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితం ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండో తరగతిలో ఏర్పడిన పునాదులపైనే ఆధారపడి ఉంటుందని డీఈవో కె.వాసుదేవరావు అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులో జరుగుతున్న భాషా, పునాది అభ్యసన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించి మాట్లాడారు. ఒకటి, రెండు తరగతుల్లో విద్యార్థులకు చదవడం,రాయడంతో పాటు గణితంలో కనీస నైపుణ్యాలు సాధించే విధంగానూ, ప్రాథమిక పాఠశాలలో నమోదు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ఏ.ప్రభాకర్, ఏఎంవో డి.గౌరీశంకరరావు, ఎంఈవోలు నాగేశ్వరరావు, మధుసూదనరావు, కేఆర్పీలు మంగారాణి, ఇందూదేవి తదితరులు పాల్గొన్నారు.



టీఎల్ఎంలను ఆసక్తిగా తిలకిస్తున్న డీఈవో వాసుదేవరావు



నామవరంలో అర్జీదారుల సమస్యవింటున్న కలెక్టర్ ప్రశాంతి

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : కలెక్టర్

దివాన్‌చెరువు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభలు నిర్వహించే క్రమంలో సంబంధిత గ్రామాలకు చెందిన రికార్డులతో హాజరుకావాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. రాజానగరం మండలం నామవరంలో మంగళవారం జరిగిన రీసర్వే గ్రామసభలో కలెక్టర్ మాట్లాడారు. రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సర్వేపూర్తయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో అభ్యంతరాలు పై భూమి వాస్తవ కొలతలకు, డాక్యుమెంట్ ప్రకారం ఉన్న కొలతలు, రీసర్వే సందర్భంగా ఉన్న కొలతలు ఆధారంగా పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత అర్జీదారులు సామూహిక పత్రంతో రీసర్వే గ్రామసభలకు హాజరుకావాలని తెలిపారు. ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ ఎన్.లక్ష్మీలావణ్య, ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జాబ్‌మేళాలో 37 మంది ఎంపిక

రాజానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 37 మంది ఎంపికైనట్లు ఏపీఎస్ఎస్‌డీసీ ఎస్‌డీవో ఎం. పెరుమాళ్‌రావు తెలిపారు. ఈమేళాలో 69 మంది అభ్యర్థులు హాజరుకాగా 37మంది ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు రాజమహేంద్రవరం, నిడదవోలు, రావులపాలెం, విజయవాడ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

జనవరి 15 వరకు గ్రామస్థాయి జన సురక్ష

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 22: కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 15నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో పోస్టర్‌ను కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు బీమా పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాష్ట్ర లీడ్ బ్యాంకు ఆదేశాలమేరకు లీడ్ బ్యాంక్ కార్యాలయం వారి సహకారంతో అందిస్తున్నారన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, అక్టోబరు 22: నియోజక వర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు.మంగళవారం నల్లజర్ల మండలంలో పలు గ్రామాల్లో అయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీపావళీ నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తామన్నారు.ముందుగా తూర్పుచోడవరంలో ముత్యాలమ్మతల్లిని దర్శించుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతపల్లిలో కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవం, నల్లజర్ల, జగన్నాథపురం, మారెళ్ళమూడి, ఆవపాడు, సింగరాజుపాలెంలో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మారాజు, ఆవపాడు జనసేన సర్పంచ్ ఆచ్యుత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆ నీళ్లు తాగితే..రావా రోగాలు?

● మురుగునీటిలోనే చేతిపంపులు ● సత్యసాయి మంచినీటి పథకమే ఆధారం

● తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్న 16వ వార్డు ప్రజలు



కరగపాడులో మురుగునీటిలో నిలబడి చేతిపంపు వద్ద బిందెలో నీళ్లు పట్టుకుంటున్న మహిళలు





పెద్దగూడెం 16వ వార్డులో డ్రైనేజీలో నిర్మించిన తాగునీటి సరఫరా, పబ్లిక్ కుళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం



... చేతిపంపు చుట్టూ పిచ్చిమొక్కలు

గోపాలపురం, అక్టోబరు 22: గోపాలపురంలోని పెద్దగూడెం 16వ వార్డులో నీరు,పారి శుధ్యవిభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో డ్రైనే జీలో నిర్మించిన బోరునీరు తాగితే రోగాలు రావా అని 16వ వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2014-19 సంవత్సరాల మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ ప్రాంతంలో నీటికొరత తలెత్తింది. దీంతో ప్రత్యామ్నాయం కోసం ఆ ప్రాంతంలో ఉన్న చేతిపంపులో విద్యుత్ మోటారు అమర్చి తాగునీటిని సరఫరాచేసి ఉపసమనం పొందామని అధికారులు భావించారు. గడిచిన ఐదేళ్లలో గత పాలకులు ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో 16వ వార్డు ప్రజలకు డ్రైనేజీలో నిర్మించిన చేతిపంపులో ఏర్పాటుచేసిన మోటారు నీరే దిక్కయ్యింది. ఆ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడటంతో సత్యసాయి మంచినీటి పథకం ద్వారా శుద్ధి జలాలు ఏర్పాటు చేశారు. దీంతో చేతిపంపు ద్వారా సరఫరా అవుతున్న నీరు ప్రజలు కేవలం ఇతర అవసరాల కోసమే వినియోగిస్తున్నారు తప్ప గొంతులో వేసుకోవడానికి ముందుకు రావడంలేదు.

సత్యసాయి నీటి సరఫరా నిలిస్తే పరిస్థితి ఏంటి?

పెద్దగూడెంలోని 16వ వార్డులో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన సత్యసాయి మంచినీటి సరఫరా నిలిచిపోతే గత్యంతరం లేని పరిస్థితుల్లో డ్రైనేజీలో చేతిపంపుద్వారా సరఫరా అయ్యే నీరే తాగాల్సి వస్తోందని కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య పెద్దగూడెం 16వ వార్డుని వెంటాడు తుందని నాటి నుంచి సమస్య అపరిష్కృతంగానే ఉందని ప్రజలు అంటున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు సత్యసాయి మంచినీటి పథకం ద్వారా సరఫరా చేసిన నీటినే తాగుతున్నామని ప్రతికూల పరిస్థితుల్లో శుద్ధి జలాల సరఫరా నిలిచిపోతే కలుషిత నీరుతాగక తప్పటంలేదని వాపోతున్నారు. 16వ వార్డు ప్రజల నీటి సమస్యపై స్పందించి ప్రత్యేక బోరు ఏర్పాటు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏం చేస్తున్నారు.

గ్రామీణ నీరు, పారిశుధ్య విభాగం ద్వారా ప్రజల దాహార్తీ తీర్చేందుకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతున్న ఆ శాఖాధికారులు దృష్టి సారించకపోవడంపట్ల ప్రజలు మండిపుతున్నారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీలో తాత్కాలిక ఉపసమనం కోసం చేతిపంపులో మోటారు అమర్చి నీరు సరఫరా చేసిన ఆ అధికారులకే ఆ విషయం గుర్తుకు రాకపోవడం బాధాకరమంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిరంతర పర్యవేక్షణ లేకపోవడమే కారణమంటున్నారు.



ఇంటిలో దొంగలు చిందర వందరగా పడవేసిన వస్తువులు

ఇంటితాళాలు బద్దలగొట్టి చోరీ

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న తలుపులు తెరచి చోరీ చేసిన సంఘటన కొవ్వూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు పట్టణంలోని బ్రిడ్జిపేట ఏజీఆర్‌బీ రోడ్డు దిగువన అద్దెకు నివాసం ఉంటున్న కల్లూరి వెంకట సుబ్రహ్మణ్యం ఆయుర్వేద ఉత్పత్తులు వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 20వ తేదీన ఇంటికి తాళంవేసి గుడివాడ బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లారు. రాత్రి 12 గంటల సమయానికి తిరిగి ఇంటికి వచ్చేసరికి మెయిన్‌డోర్‌కి వేసిన తాళం పగులగొట్టి, తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చిందర వందరగా పడవేసి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బీరువాలో ఉంచిన నగదు రూ.50 వేలు, లాప్‌టాప్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్లు పోలీసుకు తెలిపారు.ఎస్ఐ కె.జగన్మోహన్‌రావు కేసు నమోదు చేశారు.

ఇథనాల్ పరిశ్రమను తొలగించాలి

● గుమ్మళ్ళదొడ్డిలో సామూహిక నిరవధిక నిరహారదీక్ష
● ప్రధాన రహదారి నిర్బంధం
● జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ సంఘీభావం



గుమ్మళ్ళదొడ్డిలో సామూహిక నిరవధిక నిరాహారదీక్ష చేపట్టిన కాంగ్రెస్ నాయకుడు మరోతి శివగణేష్, ప్రధాన రహదారిపై బైఠాయించిన స్థానికులు

గోకవరం అక్టోబరు 22: గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామసమీపంలో నిర్మించిన కాలుష్య కారకమైన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను వెంటనే తొలగించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్‌పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్రలు స్థానికులతో కలిసి సామూహిక ఆమరణ నిరహరదీక్ష చేపట్టారు. గుమ్మళ్ళదొడ్డిలోని రామాలయంవద్ద చేపట్టిన ఈ నిరవధిక దీక్షకు మండలంలోని గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామస్థులు స్వచ్ఛందంగా తమ మద్దతు ప్రకటించగా, జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ దీక్షా శిబిరాన్ని సందర్శించి తన సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ నివాస గృహల మధ్య కాలుష్య కారకమైన పరిశ్రమను ఏవిధంగా ఏర్పాటుచేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.ప్రజాభిప్రాయం లేకుండా పరిశ్రమను స్థాపించి ప్రజలను అనారోగ్యంపాలు చేస్తారా అంటూ ప్రశ్నించారు. సముద్రతీర ప్రాంతాలలో నెలకొల్పాల్సిన కాలుష్య కారక పరిశ్రమలను జనసంచారం ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఎలా అనుమతి ఇచ్చిందో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. ఈవిషయంపై పలుమార్లు ఉన్నతాధికారులను సమాచార హక్కుచట్టం ద్వారా వివరాలు అడిగినప్పటికీ కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. గ్రామం నుంచి పరిశ్రమను తరిమి కొట్టే వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ కాలుష్య కారక పరిశ్రమను జనసేన పార్టీ ఉన్నటికీ ప్రోత్సహించిందన్నారు. ఎటువంటి ప్రజామోదం లేకుండా నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలివెళ్లి పోయేలా ఇక్కడి విషయాన్ని తమ అధినాయకుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. చుట్టూ చమురు కంపెనీలు ఉంటే మధ్యలో అత్యంత ప్రమాదకరమైన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు హేయమైన చర్య అన్నారు.

ప్రధాన రహదారిపై బైఠాయింపు

అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ స్థానికులు ప్రధాన రహదారిని నిర్బంధించారు. దీంతో అటు రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు, ఇటు రంపచోడవరం వైపు వచ్చే వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనాలు భారీస్థాయిలో నిలిచిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని నచ్చజెప్పడంతో ఆందోళనకారులు ప్రధానరహదారిపై నుంచి దీక్షా శిబిరం వద్దకు వెళ్లిపోయారు.

నిర్వాహకుల తీరుపై అసహనం

గుమ్మళ్ళదొడ్డిలో ఏర్పాటుచేసిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నిర్వహణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న స్థానికులకు ఆ పరిశ్రమ నిర్వాహకుల తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేసేందుకు పరిశ్రమలో ఏం జరుగుతుందంటూ ఆరా తీసేందుకు ఒక్క ప్రజాప్రతినిధులకు మాత్రమే లోపలకు వెళ్లేందుకు అనుమతిఇచ్చి మిగిలిన స్థానికులకు, విలేకరులకు నో ఎంట్రీ బోర్డు పెట్టడంపై సర్వత్రా పలు అనుమానాలు ఏర్పడుతున్నాయని బాధితుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రాణదాతకు సన్మానం

గోదావరిలో దూకుతున్న ఇద్దరు బాలికలను కాపాడిన ఆటో డ్రైవర్

● ఆటో డ్రైవర్‌ను సన్మానించిన ఎస్పీ

దేవరపల్లి, అక్టోబరు 22: దేవరపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ దేగల కోటేశ్వరరావు(కోటి) ఇద్దరు ప్రాణాలను కాపాడటంతో తూర్పుగోదావరిజిల్లా ఎస్పీ కోటేశ్వరరావును సన్మానించి అభినందించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన కోటేశ్వరరావు ఈనెల 19న శనివారం రాజమహేంద్రవరం వెళుతుండగా ఇద్దరు ఆడపిల్లలు గోదావరి బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకడానికి ప్రయత్నించడంతో వారిని అడ్డుకుని ఆటోలో దేవరపల్లి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన ఇద్దరు ఆడపిల్లలు రాజమహేంద్రవరంలో ఫస్ట్, సెకండియర్ ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న వారు హాస్టల్‌లో ఉండి చదవలేక రాజమహేంద్రవరం బ్రిడ్జిపైకి రావడంతో వారిని ఆటో డ్రైవర్ కోటేశ్వరరావు పోలీసులకు అప్పగించటంతో కోటేశ్వరరావును రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయంలో మంగళవారం సత్కరించి బహుమతి అందజేశారు.



ఆటోడ్రైవర్ కోటేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహకిషోర్



సచివాలయంలో ఆధార్ నవీకరిస్తున్న సిబ్బంది



ఉండ్రాజవరం సత్యవాడలో ప్రత్యేక ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు

సచివాలయాల్లో ఆధార్ నవీకరణ

కొవ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఆధార్ నవీకరిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మండలంలో మంగళవారం నాలుగు ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. మండలంలోని వాడపల్లి 1వ సచివాలయంలో 15, పెనకనమెట్ట 10, వేములూరు 12, పంగిడి 1వ గ్రామ సచివాలయంలో 18 మంది ఆధార్‌లు నవీకరించుకున్నట్టు ఎంపీడీవో సుశీల తెలిపారు. కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో 1వ వార్డు శ్రీరామకాలని సచివాలయంలో ఆధార్ నవీకరణ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్లు కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు.

తాళ్లపూడిలో: మండలంలో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీవీ రమణ తెలిపారు. అక్టోబరు 22 నుంచి 25 వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 23న తాళ్లపూడి స్పెషల్ స్కూల్‌తో పాటు పెద్దేవం హైస్కూల్, 24న వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలతో పాటు పెద్దేవం హైస్కూల్, 25న వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వీఎస్ రామారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సత్యవాడ, చివటం, పాలంగి గ్రామాల్లో నిర్వహించిన ఆధార్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ నెల 25 వరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక కేంద్రాల ద్వారా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో రామారావు చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం

కొవ్వూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపోలో దసరాను పురస్కరించుకుని అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఉద్యోగులను సత్కరించారు. మంగళవారం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ అధ్యక్షతన ఆగస్టు, సెప్టెంబరులో అత్యధిక ఆదాయం తీసుకు వచ్చిన సిబ్బందికి అభినందన సభ నిర్వహించారు. ఆగస్టులో అత్యధిక ఆదాయం తీసుకు వచ్చిన కండక్టర్లు ఎండీ రఫీవుల్లా, బి.పార్వతి, కె.వి.రావు, సెప్టెంబరులో జీవీ. కుమార్, ఎండీ రఫీవుల్లా, కెఎస్‌మన్యం ఉన్నారు. కెఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు వై.డి.రావు, జీఎస్ రావు, యువీరావు, పి.శేఖర్ దసరా సందర్భంగా డిపోకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఉద్యోగులు ఏడీసీ కె.డి.రావు, డ్రైవర్ ఎన్.వి.రావు, కండక్టర్లు కె.వి.వి.ఎస్.ఎన్. మూర్తి, పి.లక్ష్మి, ఎన్.వి.లక్ష్మి, మెకానిక్ సి.హెచ్.వి.కుమార్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏ.వి.దుర్గేష్‌లను ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు, గిఫ్టులు అందించి అభినందించారు.



ఆర్టీసి సిబ్బందిని సత్కరిస్తున్న డిపో మేనేజర్ కుమార్

ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మలకపల్లి గ్రామంలో మంగళవారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ కంటి వైద్యశాల సిబ్బంది శిబిరంలో వైద్య సేవలందిం చారు. శిబిరంలో 100 వందికి పైగా హాజ రుకాగా వీరిలో 25 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, 11 మందికి కళ్లజోళ్లు అందిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు కుంటముక్కల వీరభద్రరావు తెలిపారు. కార్య క్రమంలో మార్ని రామమూర్తి, మద్దిపాలి ప్రకాశం, దుగ్గిరాల ప్రకాష్, డాక్టర్ సీహెచ్ నాగరాజు, శ్రావణి, గోవింద్, రేఖ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



గరికపాటి నరసింహరావును సత్కరిస్తున్న వేద పండితులు, ధర్మకర్తలు

మనిషి కొత్తపోకడలకు పోతున్నాడు..

● పద్మశ్రీ గరికపాటికి ఘన స్వాగతం

తాళ్లపూడి, అక్టోబరు 22: ఆధునిక యుగంలో మనిషి ఆచారాలను, సాంప్రదా యా లను విడిచిపెట్టి కొత్త పోకడలకు వెళుతున్నాడని పద్మశ్రీ గరికపాటి నరసింహరావు అన్నారు. తాళ్లపూడిలో ఉన్న నవదుర్గా పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన శత చండీ యాగం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆయన ప్రసంగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గామాతను దర్శించుకుని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.ఉన్నదానితో సంతృప్తి పడాలికానీ అసూయ అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రతి వ్యక్తిలోనూ దేవుడు ఉన్నాడని చెప్పిన ఏకైక మతం హిందూ మతం అని అహంకారానికి లోనవ్వకూడదన్నారు. తన ప్రసంగంద్వారా విన్న కొన్ని విషయాలైనా ఆచరణలో పెట్టాలని సూచించారు. గరికపాటికి ఆలయ అర్చకులు శివప్రసాద్,చండీయాగ నిర్వాహక బ్రహ్మ శ్రీసిద్దేశ్వర శివాచార్య కార్తికేయ, శిష్య బృందం, ఆలయ ధర్మకర్తలు స్వర్గీయ నీలి పుల్లయ్య కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు.

పట్టభద్రుల వివరాలు నమోదు చేసుకోవాలి



గోపాలపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటుకు సంబంధించిన వివరాలు నవంబర్ 6లోపు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి ఒక ప్రటకనలో తెలిపారు. ఓటు దరఖాస్తుదారులు తమ దర ఖాస్తును ఎంపీడీవో కార్యాలయం, ఎంఈవో లేదా తహశీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 2021 సెప్టెంబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు 18కి డిగ్రీ ప్రోవిజినల్, సర్టిఫికెట్ నకలు, నివాస ధ్రువపత్రం నకలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు 2, ఓటు గుర్తింపు కార్డు నకలు, ఫోన్ నెంబర్ దరఖాస్తులో జతపరచాలన్నారు. నవంబర్ 23న దరఖాస్తుదారుల తుది జాబితాను సూచించిన ప్రదేశాల్లో పబ్లిక్ నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తామన్నారు. దీపావళి దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలని లేనిఎడల చర్యలు తీసుకుంటామన్నారు.

సచివాలయ వ్యవస్థను..

పంచాయతీలకు అనుసంధానించాలి

సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు

కొవ్వూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థను పంచాయతీకి అనుసంధానం చేయాలని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పి.ప్రశాంతికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యామ్నాయంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి సచివాలయానికి 11 మందిని సిబ్బందిని కేటాయించింది. వారిపై పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో గ్రామాల్లో పాలన గందరగోళంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను పంచాయతీలకు అనుసందానం చేయాలని కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, పెనకనమెట్ట సర్పంచ్ మేకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణరావు

రెవెన్యూ సదస్సులతో

రైతు సమస్యలకు పరిష్కారం



దుద్దుకూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

దేవరపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. దేవరపల్లి మండలం దుద్దు కూరులో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో 11 మంది రైతులు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. రైతుల సమస్యలను త్వరి తగతిన పరిష్కరించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు ఐవోసీ టీ.వెంకటేష్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సర్వేయర్లు, కార్య దర్శులు, రైతులు కంటిపూడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

చాగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మీనానగరం మెయిన్ రోడ్డు ప్రక్కన ఉన్న కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సమారాధనలో పాల్గొన్నారు. గ్రామ యువకులు వీటి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

వరికోత యంత్రాలపై రైతులకు అవగాహన

తాళ్లపూడి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వేగేశ్వ రపురం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రజ్ఞులు మాట్లాడుతూ నూతన వరి రకాల పనితీరు, పంట ఎదుగుదల, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారని జిల్లా ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. వరికోత మిష న్లతో పంటను కోసే విధానం, ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, ఏవో రుచిత, బి.వెంకన్నబాబు, పోసమ్మ, గౌతమి, సుధీర్ రైతులు బుద్దాల సురేష్, తైలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కలిపిస్తున్న ఏరువాక శాస్త్రజ్ఞులు

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర

నిడదవోలు

వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వేట్టయన్
శ్రీగణపతి	: విశ్వం

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర